# యజ్ఞము ఒక సమగ్ర శాస్త్రము

# THE INTEGRATED SCIENCE OF YAGNA

**(Telugu)**


*హిందీ మూలము :*

నవయుగ నిర్మాణ యోజనారూపశిల్పి

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామశర్మ ఆచార్య**

*అనువాదం :*

**దేవీ ప్రసాద్**



*ప్రచురణ :*

**గాయత్రి చేతన కేంద్రం**

అశ్విని హౌస్ వెనుక, హెచ్.పి.రోడ్,

మూసాపేట, హైదరాబాదు - 500 018.

ఫోన్ : 040-23700722, 09392506888

E-mail: gckhyderabad@yahoo.com

Book Name :
**Yagnam Oka Samagra Sastram**

**Language :** Telugu

**Book Code :** TL158

**Author :**
Brahmavarchas

**Translated by :**
Sri Devi Prasad, Guntur

**Edition :** 4th

**Month & Year :** August, 2009

**Copies :** 5,000

**Price :** Rs. 8-00

**Publishers :**
Yugnirman Yojana Press
Gayatri Taphobhoomi, Mathura - 281003 (U.P.)
Ph: 0565-2530128, 2530399

**Zonal Office :**
Gayatri Chetna Kendra,
Near Aswini House, Bharat Nagar Bus Stand, H.P. Road, Moosapet,
Hyderabad - 500 018 (A.P.)  E-mail : gckhyderabad@yahoo.com
Ph : 040-23700722, 09392506888, Fax : 040-23703430

**Andhra Pradesh Centres :**
Gayatri Shakti Peeth, Narakoduru. Ph : 0863-2534440, 9949111175
Yug Shakti Gayatri Kendra, Vijayawada. Ph : 0866-6616570, 9394863262
Yug Shakti Gayatri Kendra, Vizag. Ph : 9393105427, 9949173022
Gayatri Pragya Peeth, Goshamahal, Hyd. Ph : 040-24617643, 9393002165

**Head Office :**
Gayatri Teerth, Shantikunj,
Haridwar, Uttarakhand - 249411
Ph: 01334-260602, 260403, Fax : 01334-260866
E-mail : south@awap.org  Website : www.awgp.org  www.dsvv.org



# యజ్ఞము ఒక సమగ్ర శాస్త్రము

(ఆగస్టు '84, జూలై, ఆగష్టు '92, మార్చి '93, సెప్టెంబరు '97 హిందీ అఖండజ్యోతి మాసపత్రికలలోని ఎంపిక చేయబడిన వ్యాసముల ఆధారం.

**యజ్ఞం** అంటే **"అత్యుత్తమ కారణాల నిమిత్తం మనం స్వార్ధరహితంగా చేసే త్యాగం"** అని అర్థంగా తీసుకోవచ్చును. అహంకారం, స్వార్ధం, భౌతిక భవబంధాలను త్యాగంచేసి, యుక్తమైన ఆలోచనా విధానం, సాటి మానవులపై సానుభూతి, సర్వమానవ సౌభ్రాతృత్వానికై అంకితం చేయబడిన సృజనాత్మకత - ఇది నిజమైన, అందరూ ఆచరించదగిన, ఆచరించవలసిన అత్యుత్తమమైన యజ్ఞం. యజ్ఞంలోని తాత్వికత్వం సంఘంలో సామరస్య భావంతో జీవించడం, అత్యున్నత మానవ విలువలను సంఘంలో స్థాపించేందుకు, పెంపొందించేందుకు అవసరమయిన జీవిత విధానాన్ని మనకు బోధిస్తుంది. ఇదే ఆదర్శవంతమయిన మానవ సంస్కృతికి పునాది అవుతుంది.

సంఘంలోని అందరినీ గౌరవిస్తూ చేసే సేవను - **'సేవాయజ్ఞం'** అంటారు. ఇది చాలా ఉన్నతమయిన యజ్ఞానికి ఉదాహరణ. అలాగే ఇతరులకు అవసరమయిన జ్ఞానాన్ని, వారి జీవితాలను కాంతివంతం చేసేందుకు అవసరమయిన విజ్ఞానాన్ని, విద్యను అందించే మానవ సేవను **'జ్ఞానయజ్ఞం'** అంటారు. ప్రపంచంలోని బాధలను, వేదనలను అనుభవిస్తూ అలమటిస్తున్న వారికి అవసరమయిన నిస్వార్ధసేవను అందించి, వారి జీవితాలలో నూతన జీవాన్ని నింపి, జీవితంపై గౌరవాన్ని పెంపుచేసే భావాన్ని వారిలో ఉదయింపజేయడం - **'ప్రాణ యజ్ఞం'** అవుతుంది. ఈ విధంగా ఎన్నో రకాల యజ్ఞాలను శాస్త్రాలలో ప్రస్తావించడం జరిగింది. ఈ పుస్తకంలో భౌతికపరమైన పరిశోధనల నిమిత్తం నిర్వహించబడిన యజ్ఞాల గురించి మాత్రం వివరించడం జరిగింది.

భౌతికపరమైన పదజాలంలో యజ్ఞమంటే, భౌతిక పదార్థంలో ఇమిడివున్న(సూక్ష్మమైన)శక్తిని, నైపుణ్యంగా వినియోగించేందుకు అగ్ని ద్వారా వచ్చే ఉష్ణశక్తిని, మంత్రోచ్చారణ ద్వారా వచ్చే శబ్ద తరంగశక్తిని ఉపయోగించే విధంగా చేయబడే ఒక విధివిధానంతో కూడిన క్రియ అని అర్థం. భౌతికపరమైన ఆధారభూత శాస్త్రాల జ్ఞానం, ప్రాథమిక భౌతికశాస్త్రం అర్థంచేసుకోవడం కోసం ఎంత అవసరమో, ఈ విధమైన తత్వజ్ఞానం మరియు యజ్ఞమందలి శాస్త్రీయత ఆధ్యాత్మిక జ్ఞానం అనే శాస్త్రం గురించి అర్థం చేసుకునేందుకు, పరిశోధించేందుకు అంతగా అవసరమవుతాయి. అతి స్వల్పస్థాయిలో చేయబడే యజ్ఞాలను 'హవనం' లేదా 'అగ్నిహోత్రం' అని అంటారు.

**2. యజ్ఞమందలి శాస్త్రీయ దృక్పథం :** ఈ భౌతిక ప్రపంచంలో ప్రాథమికంగా 'శక్తి రెండు రూపాలలో గోచరిస్తుంది. అవి ఉష్ణము, శబ్దము. యజ్ఞం చేయడంలో ఈ రెండు శక్తులు, అంటే యజ్ఞంలోని అగ్నిలో వచ్చే ఉష్ణము, అప్పుడు ఉచ్చరించే గాయత్రి మరియు ఇతర మంత్రాల ద్వారా వచ్చే శబ్దము కలసి కావలసిన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక లాభాలను మానవాళికి అందిస్తాయి.

యజ్ఞ కార్యములో నిర్దేశించబడిన పదార్థాలను హవనం చేయడం ద్వారా, ఆ పదార్థాలలో ఇమిడివున్న సూక్ష్మ శక్తులను అగ్ని ద్వారా వెలికి తీసుకువచ్చి, చుట్టుపక్కల ఆవరించివున్న వాతావరణంలోనికి ఆశక్తులను వ్యాపించేలా చేసి, తద్వారా లాభం కలిగేలా చేయడం జరుగుతుంది. యజ్ఞక్రతువులో ఆయా పదార్థాలను హవనం చేస్తూ పలికే మంత్రాల ఉచ్చారణ ద్వారా, ఉత్పన్నమయ్యే విద్యుదయస్కాంత తరంగాలు ఆయా మంత్రాలలో నిబిడీకృతం చేయబడిన శబ్దసంకేతాలను, విశ్వమంతటా వ్యాపించేలా చేస్తాయి.





## 2-1 యజ్ఞంలో ఉపయోగించబడే ధూమ ఉత్పన్న సామాగ్రి

యజ్ఞంలో జరిగే పలురకాల రసాయన చర్యలను అర్థం చేసుకునేందుకు, ఇందులో వాడబడి, అర్పించబడే పలురకాల పదార్థాల గురించి తెలుసుకోవడం చాలా అవసరం. అవి ముఖ్యంగా ఈ క్రిందివి.

**1. దారువు (సమిధలు):** ఇందులో సమర్పించబడే దారువు తేమ లేనిది గానూ, ధూళి, కీటకాలు, పురుగులు లేనిదిగా ఉండాలి. యజ్ఞకుండానికి సరిపడు విధంగా, అందుకనువయిన నిడివిలో చిన్న చిన్న ముక్కలుగా చేయబడి ఉండాలి. వీటిని సమిధలు అని అంటారు. ఇందు నిమిత్తం ఉపయేగించబడే దారువులలో ముఖ్యమైనవి.

1. చందనం (శాంటలమ్ ఆల్బమ్)

2. అగరు లేదా తొగరు 3. దేవదారు

4. మామిడి 5. మోదుగు 6. మారేడు (బిల్వ)

7. రావి 8. మర్రి 9. జమ్మి 10. గులార్

యజ్ఞంలో దారువుతో బాటుగా సమర్పింపబడే ఇతర పదార్థాలు, అంటే హవన సమాగ్రిని ముఖ్యంగా నాలుగు విభాగాలుగా విభజించ వచ్చును.

**(అ) సుగంధభరిత పదార్థాలు :** ఇవి కుంకుమపువ్వు, కస్తూరి, అగరు, తొగరు, చందనం, యాలుకలు, జాజికాయ, జాపత్రి మరియు కర్పూరము.

**(ఆ) ఆరోగ్యసుగుణాలను నింపుకున్న పదార్థాలు :** ఆవునెయ్యి, పాలు, పండ్లు, (తృణధాన్యాలు) గోధుమ, వరి, బార్లీ, నువ్వులు, కందులు, మినుములు, శనగలు, బటానీలు వగైనా ధాన్యాలు, పప్పులు మొదలగునవి.

**(ఇ) మధుర పదార్థాలు :** వీటిని ఒక ప్రత్యేక నిర్దిష్టమైన అవసరాలకు అనుగుణంగా వినియోగించాలి. సాధారణంగా వాడే ముఖ్య లేమిటంటే

సోమలత, (బ్రాహ్మి, శంకపుష్ప, నాగకేసర, (ముల్హ్వాతి) (బహేద). ఎర్రచందనం (రక్తచందనం), (సంత్ లేక హరద్). ప్రస్తుతం మార్కెట్టులో ఈ క్రింది పదార్థాలతో తయారు చేయబడిన హవన సామాగ్రి, బరకగా వున్న పొడి రూపంలో దొరుకుతుంది. ఇందులో పైన్ మరియు చందనాల రంపపు పొట్టు, అగరు, తగరుచెక్కల పలుచని ముక్కలు, గుగ్గిలం (కలార్కచారి), (నాగర్మోద్) జటామాంసి, కర్పూరం, సుగంధపాల, యాలుకలు, జాజికాయ, లవంగాలు, దాల్చినచెక్క మొదలగునవి ఉంటాయి.

**2-2 దహనప్రక్రియలో ఉత్పన్నమయే పదార్థాలు :** యజ్ఞంలో మంటమండే విధానము లేదా దహన ప్రక్రియ ఈ విషయములపై ఆధారపడి ఉంటుంది. (అ) ఇందులో వాడబడే పదార్థాల ప్రకృతి, వాటి పాళ్ళు లేదా వంతులపైన (ఆ) సాధించబడిన ఉష్ణోగ్రతపైన (ఇ) అదుపు చేయబడే గాలి సరఫరాపైన (ఈ) ఉత్పత్తి అయిన వివిధ పదార్థాల మధ్య జరిగే అంతర్చర్య.

**2-2-1 దారువు యొక్క సంశ్లేషణ :** దారువులోని సెల్యులోజ్ పదార్థాపు సంపూర్ణ దహనక్రియతోబాటు, దారువు సంశ్లేషణ చర్యకు గురవుతుంది. ఇది యజ్ఞకుండంలోని సమిధల అమరిక, ఉష్ణోగ్రత పరిస్థితులు, గాలి సరఫరాలపై గాలి సరఫరాలపై ఆధారపడి ఉంటుంది.

**2-2-2 గంధోత్పత్తి, పదార్థాల (ఆవిరి) బాష్పీకరణము :** యజ్ఞకుండంలో ఉత్పత్తిఅయే ఉష్ణోగ్రత 250 డిగ్రీల సెంటిగ్రేడు నుండి 600 డిగ్రీల సెంటీగ్రేడు వరుకూ ఉంటుంది. ఇందులో ఆవిరిగా మారే పదార్థభాగాలు, మరిగే ఉష్ణబిందువుల స్థాయికి చేరుకొని, ఆవిరిగా మారి చుట్టుప్రక్కల పర్యావరణంలోనికి వ్యాపిస్తాయి. సెల్యూలోజ్ మరియు పిండిపదార్థాలు దహన పర్చబడినపుడు ఇందులోని సేంద్రియ పదార్థాలలోని హైడ్రోజన్తో





ఆక్సిజను యొక్క కలయిక జరిగి, అధిక పరిమాణాలలో నీటియావిరి ఉత్పన్నమవుతుంది. ఈ కారణంగా థైమాల్, యూజినాల్, పైనీన్, టెర్పినాల్ వంటి పదార్థాలు పరిసర వాతారవణంలోనికి వ్యాపిస్తాయి. ఇందువల్ల యజ్ఞం యొక్క సుగంధం దూరదూరాలకు వ్యాపిస్తుంది.

నీటియావిరితోబాటు అధిక పరిమాణాలలో ధూమం కూడా విడుదల చేయబడుతుంది. ఇటువంటి విభజించబడిన స్థితిలో, ఇందులో ఉన్న భారమైన కణాలు, ఈ ఆవిరులను తీసుకుపోయే యాంత్రికమైన వ్యాప్తికి సహాయపడతాయి. ఈ విధంగా ధూమం, ఆవిరికాబడిన సుగంధ పరిమళ వస్తువులను వ్యాపింపజేసే వాహకంగా అప్పటి ఉష్ణోగ్రతపైన, గాలి వాటంపైన ఆధారపడి పనిచేస్తుంది.

**2-2-3 క్రొవ్వు పదార్థాల దహనక్రియ :** యజ్ఞంలో ఉపయేగించబడే క్రొవ్వు పదార్థాలలో ముఖ్యమైనవి నెయ్యి మరియు ఇతర వృక్ష సంబందిత క్రొవ్వులు. నెయ్యి, సమిధలలోని సెల్యూలోజ్ పదార్థాన్ని త్వరితంగా అగ్నికి మండించేందుకు సహకరిస్తుంది. ఇందులో వాడే అన్ని క్రొవ్వు పదార్థాలు కూడా త్వరితంగా ఆవిరయ్యే గ్లిసరాల్ భాగము, ఎసిగోన్ బాడీస్, పైరువిక్ ఆల్డిహైడ్, గ్లయోక్సాల్ వంటి పదార్థాలను విడుదలచేస్తుంది. ఇందులో విడుదలయ్యే హైడ్రోకార్బన్లు తిరిగి నిదానంగా దహనమవుతూ మిథైల్, ఇథైల్ ఆల్కహాలులు, ఫార్మల్డిహైడ్, ఎసిటాల్డిహైడ్, ఫార్మిక్ ఆమ్లము, ఎసిటిక్ ఆమ్లములను తయారుచేసి విడుస్తాయి.

**2-2-4 కిరణజన్య రసాయన క్రియ : (Photo Chemical Process)** కరిగి ఆవిరయ్యే అన్ని పదార్థాలు పరిసరవాతావరణంలోనికి వ్యాపించగానే, ఇవి సూర్యరశ్మి సోకి మరల అనేక రసాయనచర్యలకు గురవుతాయి. బహుశ ఇందువల్లనే కాబోలు యజ్ఞం సూర్యరశ్మి ఉన్న సమయంలో చేయాలని చెబుతారు. ఇటువంటి రసాయనచర్యలు అతినీలలోహిత మరియు ఇతర

లఘుకిరణం గల కిరణాల పరిధులలో జరుగుతాయి. ధూమంలో వెలువడిన పదార్థాలు కిరణజన్య రసాయన చర్యలకు గురై విడిపోయి, ఆక్సీకరణము మరియు కుదింపు చేయబడతాయి. కార్బన్ డయాక్సైడ్ కూడా కొంతమేరకు కుదించబడి ఫార్మల్డిహైడ్‌గా మార్పు చెందుతుంది. అది ఎలాగంటే....

$$CO_2 + H_2O + 112,OOO\ Cal. = HCHO + O_2$$

పర్యావరణ పరిరక్షణ కోణంలో చూస్తే ఇలా కార్బన్‌డైయాక్సైడ్ మార్పు చెందడం, ప్రాణవాయువు ఉత్పన్నం కావడం అనేవి అతిశయోక్తికాదు.

**2-3 తిరగవేసిన పిరమిడ్ ఆకారంలోని యజ్ఞకుండం :** 'పిరమిడ్' అనే పదానికి సరయిన అర్థం 'మధ్యలో ఉన్న అగ్ని' అని. ఈ పురాతనమైన అర్థం ఆ ఆకారంలోని యజ్ఞకుండం మధ్యనుండి ఎగిసే అగ్నిజ్వాలలో శక్తులను దృష్టిలో ఉంచుకొని నిర్వచించారేమో అనిపిస్తుంది. ఈ పిరమిడ్ ఆకారానికి సూక్ష్మజీవులకు తావులేని ప్రత్యక్ష శక్తిక్షేత్రాన్ని, ఉత్పన్నం చేయడం, నిలవచేయడం అనే గుణం ఉన్నదని తెలుసుకోవాలి.

తిరగవేసిన పిరమిడ్ ఆకారంలోని అగ్నికుండం (యజ్ఞకుండం లేదా హవన కుండం)లో నియంత్రిత విధానంలో శక్తి ఉత్పన్నమై పలుదిక్కులకు వెదజల్లబడుతుంది. ఇది అసాధారణమైన శక్తిక్షేత్రాన్ని ఉత్పన్నం చేసే జెనరేటర్ లాగా వ్యవహరించి, చుట్టుపక్కల ఉన్న వాతావరణంలోకి దానిని వ్యాపింపజేస్తుంది.

ప్రతిదినం చేసే అగ్నిహోత్రం లేదా బలివైశ్యమునకు ఒక చిన్న రాగి పాత్ర వాడబడుతుంది. బోర్లింపబడిన పిరమిడ్ ఆకారంలోని ఆ అగ్నిహోత్రపు పాత్ర విద్యుదావరణాన్ని అందుకని ఉత్పత్తిచేసి, వేరుగా విభజిస్తుంది. ఇది సూక్ష్మజీవి రహితము, అతిసూక్ష్మజీవుల వ్యతిరేకరియాక్టర్ లాగా పనిచేస్తుంది. 'రాగా' విద్యుత్తు మరియు వేడిని చాలా సమర్థవంతముగ






ప్రవహింపచేస్తుంది. అగ్నిహోత్రం కూడా అగ్ని, వేడి, విద్యుదయస్కాంత వత్తిడిలతో సమకూరి ఉండడం వలన మనకు, అలా బోర్లింపబడిన పిరమిడ్ ఆకారంలోని యజ్ఞకుండం విశ్వంలో వ్యాపించివున్న శక్తిక్షేత్రాలతో అనుసంధించబడి ఉన్నదని స్పష్టమవుతున్నది.

అనుదిన అగ్నిహోత్రమునకు వాడే రాగిపాత్ర యొక్క కొలతలు ఈ విధంగా ఉండాలి. **14.5** సెం॥మీ × **14.5** సెం॥మీ పైభాగంలోనూ, **5.25×5.25** సెం॥మీ అడుగున వుండాలి. దీని ఎత్తు మూడు మెట్లుగా**6.5** సెం॥మీ చొప్పున ఉండాలి. విస్తృతస్థాయిలో జరిగే యజ్ఞాలకు, పైన చెప్పిన కొలతలను అదే పరిమాణాలకు అనువుగా ఉండేలా పెంచుకొని, నిర్దేశించబడిన కుండాలను నిర్మించాలి. యజ్ఞంలో ఒక ప్రత్యేక విధానం ద్వారా శక్తిక్షేత్రాలను, విశ్వప్రవాహాలను ఉత్పన్నం చేయాలనుకుంటే దానికి అనుగుణ్యమయిన విధానంలో, పిరమిడ్ రూపం కాకుండా, కొన్ని ప్రత్యేక రేఖాగణిత అనుగుణ్య రూపాలలోని నమూనాలను వాడమని సిఫార్సు చేయబడింది. విభిన్న ప్రయోజనాల కొరకు యజ్ఞాలను నిర్వహించేందుకు విభిన్నమైన, నిర్దిష్టమైన కుండాలను ఉపయోగించాలని, నిర్దేశించబడింది. ఇలాంటి సామాన్యంగా ఉపయోగించే యజ్ఞకుండాల రూపాలు, ప్రక్కనున్న చిత్రంలో ఇవ్వబడ్డాయి.

**2-4సంస్కృత మంత్రాల పఠనం :** ఈ శబ్ద సూక్ష్మస్థాయి మరియు విశ్వవ్యాపిత స్థాయిలలో శక్తి ఆవరణాలను ఛేదించ గలుగుతాయి. సంస్కృత భాషలోని అన్ని అక్షరాలు ప్రత్యేక ప్రకంపన శక్తిని గలిగిఉన్నాయి. ఇవి ఉచ్చరించబడినపుడు ఒక తరంగ విన్యాస సమ్మేళనాన్ని ఉత్పన్నం చేయగలుగుతాయి.

డా॥ హావర్డ్‌స్టీన్‌గల్ అనే అమెరికన్ శాస్త్రవేత్త, గాయత్రీ మంత్రం ఉచ్చరించినందువల్ల **110,000** శబ్దతరంగాలు ఒక సెకనుకు ఉత్పత్తి

## కొన్నిరకముల యజ్ఞకుండీలు






యజ్ఞము ఒక సమగ్ర శాస్త్రము

అవుతాయని పరిశోధించి వెల్లడిచేయడం చాలా ఆసక్తికరమైన విషయం. యజ్ఞ సమయంలో గాయత్రీ మంత్రోచ్చారణ విధానం, ఆయా మంత్రాలలో వున్న విశ్వశక్తి కేంద్రాల నుండి వెదజల్లబడుతున్న జీవశక్తి తరంగాలలయతో కూడుకున్న శబ్దం లేదా సంగీతం యొక్క సారం కలిగి ఉండేలా తీర్చిదిద్దబడ్డాయి. (గాయత్రీ మంత్రానికి సంబంధించిన విశ్వశక్తి కేంద్రం సూర్యుడు) ఈ మంత్రాలను ఉచ్చరించడం వలన మానవులకు, వృక్ష, పశు, పక్ష్యాదులకు కూడా ఆహ్లాదం కలిగించే శబ్దతరంగాలు ఉత్పన్నమవుతాయి. ఈ శబ్దతరంగాలు, నిర్దిష్ట శక్తితరంగాలుగా, ఆహుతులనర్పిస్తుండగా ఆ పరిసర వాతావరణంలోకి వెదజల్లడంలో సహాయపడతాయి.

**3. యజ్ఞం ద్వారా పర్యావరణ పరిశుద్ధత :** పెరుగుతున్న కర్మాగార సముదాయాలు, అతివేగంగా మారుతున్న పట్టణాలు,అడవుల కొట్టివేత, వాయు మరియు జలకాలుష్యాలు, ఓజోన్ పొరలో రంధ్రాలు, అణుధార్మిక వ్యర్థపదార్థాలు ఇవన్నీ కలిసి మానవ, పశు, వృక్షాల జీవనచక్రాల గమనాన్ని తల్లక్రిందులు చేసేస్తున్నాయి. నాగరికుడిగా భావించుకుంటున్న మానవుడు చేస్తున్న పై అనుచిత చర్యల వలన కేవలం మనిషికేకాక, ఈ ప్రపంచంలోని జీవకోటి మనుగడకే ముప్పు సంభవించింది.

మొన్నటి వరకూ విజ్ఞాన శాస్త్రంలోకి తరచిచూసి చేసే పరిశోధనల వలన మనిషి ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికీ సమాధానం దొరకగలదనే భావించబడింది. నేడు మనం పెరిగిన వాతావరణ కాలుష్యం వలన వ్యాధులు పెరగడమేకాకుండా, అవయవాలు సరిగా పనిచేయకపోవడమనే ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాము. ఓజోన్ పొర పలుచనకావడం వలన, సూర్యరశ్మి వలన చర్మం నల్లబడడం, చర్మానికి క్యాన్సర్, కళ్ళలో శుక్లాలు, రోగనిరోధక శక్తి తగ్గడం అనే అస్వస్థతలను ఎదుర్కోవలసివస్తున్నది.

వైరస్‌లు రానురాను మందులకు అతీతంగా మారి, మరింతగా పెరుగుతున్న వైనం మనందరికీ తెలుసు.

ప్రతిదినం యజ్ఞం (అగ్నిహోత్రం) నిర్వహించబడుతున్న ఇళ్లలో భౌతికమయిన అస్వస్థతలు, అనారోగ్యం, వ్యాధులు సంభవించడం తగ్గుముఖం పట్టినట్లుగా పరిశోధనలలో వెల్లడయింది. ఎందుకంటే, యజ్ఞం వలన స్వచ్ఛమైన, పోషణాయుతమైన, ఔషధీకృత వాతావరణం ఏర్పడటమే కారణం. ఇది మెదడు యొక్క కణాలను వినూత్న పరుస్తుంది. చర్మాన్ని ఉత్తేజపరిచి, రక్తాన్ని శద్ధిచేసి, ఆయా ప్రదేశాలలో రోగకారకమయిన క్రిములు పెరగకుండా నిరోధిస్తుంది.

అగ్నిహోత్రమంటే ప్రాథమికంగా ఒక చికిత్సావిధానము. "వాతావరణానికి చికిత్స జరిపితే, ఆ ,ఇకిత్స పొందిన వాతావరణం మిమ్మల్ని స్వస్థపరుస్తుంది.'' యజ్ఞంలో వాయురూపం పొందిన ధూమపరచబడిన వస్తువులలో ఉన్న ఎలక్ట్రానులు విడుదలయి, వాతావరణాన్ని పరిశుద్ధపరచడం, ఈక్రియలో జరిగే మరొక అనుబంధచర్య. ఈ విషయంపై కొంతమంది ప్రఖ్యాత శాస్త్రవేత్తల పరిశీలనా వివరాలను మనం పరిశీలిద్దాం.

డా॥ హాఫ్‌కిన్ ఈ విధంగా తెలియజేశారు. బెల్లం, నెయ్యి కలిపి అగ్నిలో వేసినందువల్ల కొన్నిరకాల వ్యాధులను కలుగజేసే సూక్ష్మజీవులను మట్టుబెట్టే ఒక విధమయిన ధూమం ఉత్పన్నమవుతుంది. ఈ ధూమం కంఠంలోని ఒకరకమయిన గ్రంధులను ఉత్తేజపరిచి నందువలన, ఒకరకమయిన ద్రవం ఉత్పత్తి అవుతుంది. ఆ ద్రవం వలన హృదయం, మనస్సు సంతోషంతో నిండిపోతాయి.'' "బెల్లం అగ్నిలో వేయడంద్వారా ఉత్పన్నమయే ధూమం వాతావరణాన్ని పరిశుద్ధపరిచే గుణంతోబాటు, క్షయ, ఆటలమ్మ, మశూచి వంటి అంటువ్యాధుల కారకాలయిన





సూక్ష్మక్రిములను అంతమొందిస్తుంది.'' అంటారు ప్రొఫెసర్ టిల్‌వార్డ్.

డా॥షిరోవిచ్‌ఖ అనే రష్యన్ శాస్త్రవేత్త: "విజయంతమైన పరిశోధనల ద్వారా మేము 'ఆవు' మరియు 'యజ్ఞాల' గురించి భారతీయులకు కూడా తెలియని అనేక విషయాలను తెలుసుకున్నాం. (1) అణుధార్మిక శక్తి నుండి రక్షణ నిచ్చే గొప్ప శక్తి ఆవుపాలలో వుంది. (2)ఆవుపేడతో నేల అలకబడిన ఇళ్ళకు అణుధార్మిక శక్తి నుండి పూర్తి రక్షణ ఉంటుంది. అగ్నికి ఆహుతిగా సమర్పించిన ఆవునెయ్యి ద్వారా వ్యాపించే ధూమానికి, అణుధార్మిక వ్యాప్తిని చాలా వరకు నిరోధించగలిగే శక్తివుంది. దీనినే భారతీయులు వారి భాషలో యజ్ఞం అంటారు'' అంటూ తెలియజేశారు.

అగ్నిహోత్రం నుండి వెలువడే ఔషధీయుక్త వాయువుతో జరిపిన పరిశోధనలలో, ఒక సూక్ష్మజీవశాస్త్రవేత్త కనిపెట్టిన విషయాలవలన, ఇది వాతావరణాన్ని బాక్టీరియా రహితం చేస్తుందని తెలిసింది. ఈ సూక్ష్మజీవుల కారణంగా అనేక వ్యాధులు, అనారోగ్యం కలుగుతుంది. అందువల్లనే కాబోలు, అనుదినము అగ్నిహోత్రము ఆచరించబడే ఇళ్ళలో ఇటువంటి అంటువ్యాధుల, అనారోగ్యపు బెడదలు కనిపించడం చాలా అరుదు.

సూక్ష్మజీవ రసాయనశాస్త్రంలో బాగా తరచి చూడనక్కరలేకుండానే, యజ్ఞం నిర్వహించడం వలన గాలి శుద్ధి పరచబడుతున్నదన్న విషయం మనకు స్పష్టంగానే తెలుస్తున్నది. ఈ క్రింద వివరించబడిన నాలుగు విధానాలలో ఇది సంభవిస్తున్నది.

**3.1 దుర్వాసనల నిర్మూలన :** ముందుగా వివరించిన విధంగా, బాష్పీకరణము (ఆవిరి) చెందే విధానంలో, రకరకాల కరిగివున్న నూనెలు ఆవిరి, ధూమంతో కలిసి పరిసర వాతావరణంలోకి వ్యాపిస్తాయి. ఇటువంటి నూనెలకున్న సహజ పరిమళం వలన ఆ ప్రదేశంలోని దుర్వాసనలు నశిస్తాయి. ఫినాల్, యూజినాల్, పైనీ, టెర్పినాల్, గంధపునూనె, కర్పూరము,

లవంగాల యొక్క వాసనలు వ్యాపిస్తాయి కనుక, పై సుగంధాలను మనం యజ్ఞం జరుగుతున్న పరిసరాలలో అనుభవించగలుగుతాము.

**3.2 సూక్ష్మక్రిమి నిర్మూలన:** ముందుగా మీకు దహనప్రక్రియలో ఉత్పన్నమయ్యే పదార్థాల గురించి తెలియజేయడం జరిగింది. ఈ క్రియలో హైడ్రోకార్బన్‌ల పాక్షిక ఆక్సీకరణము, సంక్లిష్ట జీవసంబంధ పదార్థాలు మండడం వలన ఫార్మాల్‌డిహైడ్ ఉత్పన్నమవుతుందని మనం తెలుసుకున్నాము. ఇది చాలా శక్తివంతమైన యాంటీసెప్టిక్(కుళ్ళును నిరోధించే) పదార్థము. అలాగే ఫార్మాల్‌డిహైడ్ యొక్క క్రిమినాశక శక్తి, నీటిఆవిరితో కలిసినప్పుడు చాలా సమర్థతను సంతరించుకుని పనిచేస్తుంది. ఇలాంటి నీటి ఆవిరి యజ్ఞసమయంలో విస్తృతస్థాయిలో ఉత్పన్నమవుతుంది. గోడలు, సీలింగ్‌లు సూక్ష్మజీవి రహితం చేయాలంటే ఫార్మాల్డిహైడ్‌ను స్ప్రే చేస్తుంటారు. ఇటువంటి 'స్ప్రే' యజ్ఞ సమయంలో అయాచితంగానే జరుగుతుంది.

హైడ్రోకార్బన్ల ఆక్సీకరణము వలన ఫార్మిక్ ఆమ్లము, ఎసిటిక్ ఆమ్లాలు ఉత్పన్నమవుతాయి. ఇవి రెండూ అంటురోగ వ్యాప్తిని నిరోధించేవే.

అంటువ్యాధులు వ్యాపించకుండా, సూక్ష్మక్రిమి నిరోధకంగా పనిచేస్తున్న యజ్ఞం నుండి ఉత్పన్నమయిన ధూమంతో ఎలుకలు, కుందేళ్ళపైన కొన్ని ప్రత్యేకమయిన పరీక్షలు నిర్వహించగా సూక్ష్మక్రిములను నిరోధించడంలో ఈ ధూమం చాలా శక్తివంతంగా పనిచేస్తుందని నిర్ధారించబడింది.

**యజ్ఞ కుండంలో మిగిలిన యజ్ఞభస్మం నీటిలా కలిపితే, నీటిలో కాలుష్యాలన్నీ నశించి, అవి త్రాగేందుకెంతో అనువుగా మారాయి.**

**3.3 క్రిముల నిర్మూలన :** సూక్ష్మక్రిములు కాకుండా కొన్ని పరాన్న జీవులయిన ఈగలు, పేలు, నల్లులు, రింగ్‌వర్మ్ మొదలయిన వాటిని





నిర్మూలించడం కొంచెం కష్టమే. ఎందుకంటే, వాటిని నిర్మూలించేందుకు ఉపయోగించే కీటకనాశినులు, మనుషులకు కూడా హానిచేస్తాయి. సాధానణ రసాయన పదార్థాలకు అవి నిరోధకాన్ని పెంచుకున్నందువలన వాటిపై అవి పనిచేయవు. గాలిలో కరిగి కలిసిపోయే కర్పూరతైలం వంటివాటివలన అవి చనిపోతాయి లేదా దూరంగా పారిపోతాయి.

**3.4 మొక్కలు వృక్షజాలంపై యజ్ఞప్రభావం :** మనుష్యుల వ్యాధులకు వృక్షాల వ్యాధులకు, కారకమయిన సూక్ష్మక్రిములు వేర్వేరు రకాలకు చెందినవైనా, యజ్ఞం వలన వాతావరణంలో సూక్ష్మక్రిమి నివారణ మొక్కలకు, వృక్షజాలానికి కూడా లాభం జరుగుతుంది. సూక్ష్మీకరణ వల్ల వ్యాప్తి,చెందిన సుగంధవాయువులు కొన్ని రకాల క్రిములనుండి చెట్లకు కూడా రక్షణ అందజేస్తాయి.

ఇందువలన మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. అగ్నిహోత్రపు వాతావరణం. దానినుండి వచ్చిన భస్మం వ్యవసాయానికి సహకారులుగా వాడుతూ, 'సహజ వ్యవసాయపు విధానం'గా దీనిని మనం అభివర్ణించవచ్చును. మరోవిధంగా దీనిని "అగ్నిహోత్రపు వ్యవసాయం అనికూడా అనవచ్చును. నిజంగా ఒక సరదా అయిన ఆలోచన ఏమిటంటే, క్షేత్రం మధ్యలో యజ్ఞాన్ని నిర్వహించి, దానిలో వచ్చిన భస్మం ఎరువుగా వాడితే ఏర్పడిన వాతావరణ సమతుల్యత (Ecological Cycle Balancing) వలన పరిపూర్ణ ఆరోగ్యవాతావరణంలో మొక్కలు పెరుగుతాయి. దీనివలన ప్రకృతి, వాతావరణాలకు ఎంతోమేలు కలగడమేకాక ఉత్పత్తికూడా అధిక మవుతుంది.

**3.5 యజ్ఞంలో ఉద్భవించిన కార్బన్ డై యాక్సైడ్ ($CO_2$) పాత్ర :** మామూలుగా మనం కాలుస్తున్న కట్టెలు, శిలాజ సంబంధమైన రాతిబొగ్గు వగైరాల నుండి ఉత్పన్నమయ్యే కార్బన్‌మోనాక్సైడ్ (CO) కార్బన్‌డైయాక్సైడ్

($CO_2$) వలన వాతావరణంలో మార్పువచ్చి 'గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్' అనబడే ఉష్ణోగ్రత పెంపు సంభవిస్తున్నది. దీనిని ఆధారంగా తీసుకుని యజ్ఞంలో కూడా ఇదే విధంగా CO, $CO_2$ లు ఉత్పన్నమవుతాయని వాదించవచ్చును. అయితే ఇక్కడ మనం గమనించవలసినదేమంటే, యజ్ఞంలో ఆహుతిచేయబడే సమిధలు ఒక నిర్దిష్టమయిన, నిదానమయిన పద్ధతిలో మండించబడతాయి. దీనిని మనం కర్మాగారాలలో కాల్చబడే బొగ్గుతోనూ, ఇళ్ళలో కాలుస్తున్న కట్టెలతోనూ, పెద్దయంత్రాలను నడపడానికుపకరించే మంటలతోనూ పోల్చకూడదు. ఆ విధానాలలో అధిక స్థాయిలో ప్రాణవాయువు హరించబడి అత్యధిక స్థాయిలో కర్బనవాయువు విడుదల చేయబడుతుంది. అయితే యజ్ఞ విధానంలో జరిగే నిదానమయిన ప్రక్రియ వలన ఆక్సిజను అధికస్థాయిలో పీల్చబడదు, ($CO_2$) అధికస్థాయిలో విడుదల చేయబడదు. వాతావరణానికి ఎటువంటి భారాన్ని ఇది కలుగజేయదు. సరికదా, ఇందులో నుండి వెలువడిన కర్బన వాయువు ($CO_2$) పరిసరాలలోని వృక్షసంతతిచే వెంటనే గ్రహించివేయబడుతుంది.

మరో ముఖ్యమయిన సంగతి ఏమంటే యజ్ఞం నుండి వెలువడే $CO_2$ విడిగా ఆవిర్భవించదు. కొన్ని సుగంధ తైలాలతోనూ, క్రిమినిరోధక పదార్థాలతోనూ కలిసి వెలువడుతుంది. అటువంటి పదార్థాలను పరిసరాలలోనికి వ్యాపింపజేసే ఒక వాహకంగా $CO_2$ పనిచేస్తుంది.

కొన్నిరకాల మానసిక వ్యాధులలో మెదడుకు ఉత్తేజకారిగా $CO_2$ ను ఉపయోగించడం వైద్య ప్రపంచానికి తెలిసిన సాధారణ విషయం. చాలా రకాల మానసిక వ్యాధుల నివారణలోనూ, నియంత్రించడంలోనూ దీనిని ఉపయోగించడం వైద్యశాస్త్రానికి అనుభవమే! యజ్ఞాన్ని చేస్తున్న వ్యక్తులు కొద్ది మోతాదులలో $CO_2$ ను, సుగంధ ధూపాలను పీల్చుతుంటారు. కాబట్టి వారికి స్వల్పస్థాయిలో ఉత్తేజకారిణులు అందుతూ, వారికేమన్నా మానసిక వైకల్యాలుంటే వాటిని నివారించడంలో సహకరిస్తాయి.





ముఖ్యమయిన సంగతి ఏమంటే యజ్ఞం నుండి వెలువడిన అగ్ని మరియు భస్మం వలన వాతారణంలోని అణుధార్మికత తగ్గడం లేదా పూర్తిగా నిర్మూలించబడటం జరిగింది అన్న విషయం ఋజువు పర్చబడింది. ఈ విషయంపై P.S.I. పరికరాలతో పోలెండుకు చెందిన డా॥ ఎల్. మాటేలా అనటోనిన్వోవిస్కా చేసిన పరిశోధనా ఫలితాలే ఇందుకు ఋజువు.

**3.6** పర్యావరణ, సాంకేతికతల సలహాదారులు, ఉత్తరప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ సంచాలకులు అయిన డా॥ మనోజ్ గార్గ్ నిర్దేశికత్వంలోని ఒక శాస్త్రవేత్త బృందం, ఉ॥ప్ర॥లోని గోరాఖ్‌పూర్‌లో జరుపబడిన అశ్వమేధ యజ్ఞ సందర్భంలో కొన్ని పరిశోధనలు జరిపారు. యజ్ఞశాల నుండి 100మి॥లీ॥ నీటిని, గాలిని నమూనాలుగా సేకరించి, హైవాల్యూమ్ ఎన్విరోటెక్ SPM-45వంటి అతి సునిశితమయిన పరిశోధనా పరికరాలతో పరీక్షించడం జరిగింది. అ పరిశోధనా ఫలాతాల సారాంశాన్ని అఖండజ్యోతి, సెప్టెంబర్ '97 సంచికలో ప్రచురించడం జరిగింది. ఆ పట్టికలు ఇవి.

**వాయు నమూనాలలో (సగటు నమూనాలో మి॥గ్రా॥ యూనిట్‌గా)**

| సమయం | సల్ఫర్‌డైఆక్సైడ్ స్థాయి | నైట్రస్ ఆక్సైడ్ స్థాయి |
|---|---|---|
| యజ్ఞానికి ముందు | 3.36 | 1.16 |
| యజ్ఞం జరుగుతుండగా | 2.82 | 1.14 |
| యజ్ఞానంతరం | 0.80 | 1.02 |

**సగటు నీటి నమూనలలో సూక్ష్మక్రిముల సంఖ్య**

| | |
|---|---|
| యజ్ఞానికి ముందు | 4500 |
| యజ్ఞం జరుగుతుండగా | 2470 |
| యజ్ఞానంతరం | 1250 |

**యజ్ఞభస్మంలోని ఖనిజాలు**

| | | | |
|---|---|---|---|
| భాస్వరం | 4076 | మి॥గ్రా / | కి॥గ్రా॥కు |
| పొటాషియం | 3407 | ,, | ,, |
| కాల్షియం | 7822 | ,, | ,, |
| మెగ్నిషియం | 6424 | ,, | ,, |
| నైట్రోజన్ | 32 | ,, | ,, |

వాతావరణ కాలుష్యాన్ని నివారించడంలో యజ్ఞం ముఖ్యపాత్ర నిర్వహిస్తున్నదనే వాదనను పైనుదహరించిన ఫలితాలు బలపరుస్తున్నాయి. వ్యవసాయశాఖకు చెందిన ఒక ఉపసంచాలకుడు ఈ ఫలాతాలను పరిగణన లోనికి తీసుకొని, యజ్ఞభస్మాన్ని పంటలకు సూక్ష్మపోషకాలందించే ఎరువుగా ఉపయోగించ వచ్చునని సిఫార్సు చేశారు.

1993-1995 మధ్యలో దేశ విదేశాలలో శాంత్‌కుంజ్, హరిద్వార్‌చే నిర్వహించబడిన 27 భారీస్థాయి యజ్ఞాలలో జరుపబడిన పరిశోధనలలో కూడా పైన ఉదహరించబడిన ఫలితాలకు సమానమయిన ఫలితాలను పొందడం జరిగింది.

**4, యజ్ఞోపతి : వైద్యరంగంలో యజ్ఞం యొక్క ఉపయోగం :** ఆధునిక యుగంలోని శాస్త్ర సాంకేతిక విధానాల వలన మనిషిని సౌకర్యంగా ఉంచేందుకు, ఆస్థాయిని పెంపుజేసేందుకు జరుపుతున్న నిరంతర కృషితో ఎంతో ఆద్భుతమయిన ఫలితాలను సాధించిన నేపద్యంలో "ఒత్తిడి - కాలుష్యం" అనేవి రెండు అత్యున్నతమైన సవాళ్ళుగా ఎదురునిలిచాయి. ఈ ఆధునిక శాస్త్రవిజ్ఞానం వలన సమకూరే సౌకర్యాలు, మన జీవితాన్ని ప్రపంచం ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నది. నిజానికి ఒత్తిడి - ఆదుర్దాలతో బాటుగా మనకు తెలియని అనేకరకాల వ్యాధులు, చెప్పలేనంత ఆందోళన, భయంవంటివి, ఈ అతిగా కలుషితమైన వాతావరణం, ప్రకృతిలోని





సమతుల్యత లోపించడం వలన కలుగుతున్నాయి. మన సాధారణ జీవిత విధానాన్ని తిరిగి ఆలోచించి, సరయిన మార్గంలో పెట్టుకొవలసిన సమయం ఆసన్నమయిందనే హెచ్చరికను, మనకు ఇది అందజేస్తున్నది. ప్రాచీన భారతీయ శాస్త్రాలు ఇటువంటి సందర్భాలలో ఉపయోగించేందుకే మనకు అందించిన వరంగా, యజ్ఞం మనకు దర్శనమిస్తుంది. ఒక మామూలు భౌతిక శాస్త్ర పరిశోధనాంశాలలో యజ్ఞం ద్వారా సమకూరే ఆధ్యాత్మిక ఫలితాలను పొందడంగానీ, తిరిగి చూపించడంకానీ, ఎంతమాత్రం కుదరని విషయం. అయితే, శారీరక, మానసిక వ్యాధుల నివారణలో యజ్ఞం ఉపకరిస్తుందనే వాదునను కూడా నిర్ధారించుకొనవచ్చును. 'బ్రహ్మవర్చస్ శోధ్ సంస్థాన్' యజ్ఞంలోని ఈ విభగంపై ప్రత్యేక పరిశోధనను చేపట్టింది.

సాంప్రదాయబద్ధమైన వైద్య విధానంలో శారీరక వ్యాధుల నివారణ నిమిత్తం మందులను నోటి ద్వారా శరీరంలోనికి చేరవేస్తుంటారు. అని లోనికి చేరి, జీర్ణించబడి శరీరం చేత గ్రహించబడిన తరువాతనే దాని ప్రభావం శరీరానికి అందుతుంది. నోటిద్వారా తీసుకోబడిన ఔషధంలోని చాలా భాగాన్ని మన జీర్ణవ్యవస్థ సరిగా వినియోగించలేదు. ఇలా తీసుకోబడిన ఔషధాలు కొన్ని జీర్ణవ్యవస్థను తారుమారు చేస్తాయి కూడా. రక్తంలోనికి ఇంజెక్ట్ చేయబడిన ఔషధాల కథకూడా ఇంచుమించు ఇంతే. ఇవి ఫలితాలను అతి త్వరగా ఇస్తాయి, అయితే వీటి ద్వారా వచ్చే సైడ్ ఎఫెక్ట్స్ (వ్యతిరేక అనుబంధ చర్యలు) కూడా అంతే త్వరగా కనబడతాయి. రక్తంలోని తెల్లకణాలు, రక్తంలోకి ప్రవేశించే విదేశీ పదార్ధాన్ని ప్రవేశించకుండా అడ్డుకుంటాయి. కొన్ని సందర్భాలలో ఇతర పదార్ధాల దాడికి శరీరంలో జరిగే ప్రతిచర్య చాలా తీవ్రంగానూ, మరి కొన్ని సందర్భాలలో మృత్యుసమానం గానూ కూడా వుంటుంది. యజ్ఞసమయంలో ఓషధులు, మూలికలు ఆహుతులుగా యజ్ఞాగ్నికి అర్పించబడతాయి. ఇవి ఆవిరిగామారి, వాయుస్థితిలో నాశికద్వారా ఊపరితిత్తులలోనికి,

చర్మంపైనున్న రంధ్రాల ద్వారా శరీరంలోనికి చేరుకుంటాయి. ఇది శరీరంలోని ప్రతి అణువుకూ, అతి సమర్ధంగా తేలికగా, నిరపాయకరంగా ఔషధాన్ని అందించే చర్యగా ఋజువు చేయబడుతున్నది.

యజ్ఞంద్వారా మానసిక వ్యాధులు నివారించేందుకున్న అవకాశాలు చాలా ఆశాజనకమయినవి. నేటికీ మానసిక వ్యాధుల నిర్ధారణ, చికిత్సలు ఆధునిక నిధానంలో పరిణతి చెందలేదనే చెప్పవచ్చు. న్యూరోసిస్, సైకోసిస్, షైజోఫెర్నియా, డిప్రెషన్, టెన్షన్, మెలంకోలియా, మనియా, హిస్టీరియా వంటి మానసిక వ్యాధులను నిర్ధారించేందుకు అవసరమయిన పరికరాలుగానీ, అంగీకరించబడిన చికిత్సా విధానముగానీ లేనేలేవని చెప్పవచ్చును. మరోవిధంగా చూస్తే శారీరక వ్యాదులకంటే ఎక్కువగా, మనిషిని తేలికగా కృంగదీసే మనో సంబంధిత వ్యాధులు హద్దుమీరి పెరుగుతున్నాయి.

ఈ మనో సంబంధిత వ్యాదులు మనల్ని ఆవరిచాయనే విషయం అవి అంకురించినప్పటికంటే పెరిగిన తరువాత మాత్రమే కనిపిస్తాయి. అందువల్లనే, వీటిపైన అంతగా శ్రద్ధ చూపబడటంలేదు. ఆధునిక జీవిత విధానంలోని ఒత్తిడి, శ్రమ, సాంఘిక ప్రవర్తనలోని కృంగుదల, నైతిక విలువల పతనం మన చుట్టూ వ్యాప్తిస్తూ మనో సంబంధిత వ్యాధుల పెరుగుదలను ఆందోళన కలిగించేంతగా చేస్తున్నాయి. ఇటువంటి ప్రమాదకర సమస్యకు యజ్ఞం సానుకూలమయిన పరిష్కారాన్ని ఇవ్వగలదు.

శారీరక మానసిక వ్యాధులను నివారించే నిమిత్తం యజ్ఞ సాంకేతికతను ఉపయోగించడమంటే కేవలం యజ్ఞంలో ఓషధులను, మూలికలను, వేసి వాయు రూపంలోకి మార్చటం ఒకటే కాదు, అందులో సమిధలుగా వాడబడే వివిధ దారువులు మండించటం కూడా మనకు అవసరమయిన, అనుకూలమయిన స్థితిగతులు ఏర్పడతాయి. బ్రహ్మవర్చస్





శోధ్ సంస్థాన్‌లో ఇటువంటి అన్ని విషయాలపైన పరిశోధనలు జరుగుతున్నాయి. తద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా ఒక నూతన వైద్యవిధానము ఆవిర్భవించబడి, ప్రపంచంలో ప్రస్తుతం ఉన్న వైద్య విధానాలయిన అల్లోపతి, హోమియోపతి, క్రోమోపతి, నాచురోపతి వంటి వాటి సరసన 'యజ్ఞోపతి'గా ఒక గౌరవ నీయమయిన, గణనీయమయిన స్థానం ఏర్పడే అవకాశం ఉంది. ఈ కార్యక్రమంలో నిమగ్నమయిన వారు మేధావులు, అత్యున్నత స్థాయి పరిశోధకులు అయినందువలన, మనం ఊహించిన దానికంటే వేగంగా యజ్ఞోపతి ఒక శాస్త్రంగా, ఒక ఉత్తమ వైద్య విధానంగా వాడుకలోకి తేబడుతుందనిపిస్తున్నది. ఆధునిక యుగంలో జరిగిన ఒక విలక్షణమయిన అద్భుత కార్యంగా ఇది పరిగణించబడగలదు.

**4.1** డా॥ సెల్వమూర్తి అనే వైద్యుడు ఒక ప్రత్యేక తరహాలోని యజ్ఞకుండంతో సూర్యాస్తమయ సమయంలో జరిపిన పరిశోధనలలో దానికి సంబంధించిన మంత్రాల వలన న్యూరోఫిజియాలజికల్ అనబడే వరాలకు సంబంధించిన మార్పులు సంభవించడం, గమనించడం జరిగింది. ఈ పరిశోధనాత్మక అధ్యయనానికి **8**మంది ఆరోగ్యవంతులయిన వ్యక్తులను ఎన్నుకోవడం జరిగింది. వారు రెండు రోజులపాటు సాయంత్రం**4**గం॥ హాజరయ్యేవారు. మొదటిరోజు వారిని యజ్ఞసమక్షంలో అగ్నిహోత్రం ముందు కూర్చుండబెట్టి, అందుకు సంబంధించిన మంత్రాలు కాక ఏవేవో సంబంధంలేని శబ్దాలను వల్లించి వారి స్థితిగతులను గమనించి గుర్తించడం జరిగింది. రెండవరోజు సాయంత్రం హోమగుండం ముందు సంబంధిత మంత్రాలను నియమ ప్రకారం వల్లించుతూ యజ్ఞకార్యక్రమం నిర్వహించి, ముందురోజు మాదిరిగా వారిస్థితిగతులను రికార్డు చేయడం జరిగింది, అంటే, గుండె కొట్టుకుంటున్న విధానం, ఇసిజి లీడ్ - **11**, రక్తపోటు వంటి వాటిని రెండు రోజులూ రికార్డు చేశారు.

ఆ పరిశోధనలలో మొదటిరోజు మనస్సు (మెదడులోని తరంగాలు) ఏమార్పు చెందలేదు. రెండవరోడు సరయిన విధానంలో యజ్ఞం జరిగిన తరువాత ఫలితాలను చూస్తే అవి గణనీయమయిన మార్పులుగా గుర్తించారు. అదేమిటంటే -

1. నియమిత అగ్నిహోత్ర సమయంలొ GSR గమనించదగిన ఉన్నత స్థాయిలో ఉన్నది

2. ఎలక్ట్రోకార్డియోగ్రామ్ ECG లో బేస్‌లైన్ షిఫ్ట్ జరిగింది.

3. ఎలక్ట్రోఎన్‌సెస్‌లో గ్రామ్ EEG లో ఆల్ఫాతరంగాల పెంపుదల, డెల్టాతరంగాల తగ్గుదల దాదాపు 15 నిమిషాలపాటు జరిగింది.

ఇటీవల కాలంలో వ్యాధులను నిరోధించబడడం, నివారించడంలో మనసుకు సంబంధించిన పాత్రను గమనించి, అంగీకరించడం జరిగింది. 'వాతావరణము - ప్రాణము - మనస్సు' అనేవి ఒకదానితో ఒకటి అనుసంధానం చేయబడి ఉన్నందువలన, యజ్ఞవాతావరణంలో ఉన్నప్పుడు వ్యక్తులు ఎంతో విశ్రాంతిగానూ, భారం తొలగినట్లు, క్లేశాలను పోగొట్టుకున్నట్లు, ఒత్తిడి నుండి విముక్తులయినట్లు అనుభవాన్ని పొందారు. యజ్ఞం జరుగుతున్నప్పుడు పరిసర వాతావరణంలో ప్రాణశక్తి స్థాయి పెరిగినట్లు, డా॥ మత్తియాస్ ఫెర్బింగర్ అనే జర్మనీ శాస్త్రవేత్త 'కిరిలియన్ ఫోటో గ్రాఫ్' (వ్యక్తుల చేతుల ఛాయాచిత్రాల సహాయంతో) ఆధారంగా నిర్ధారించడం జరిగింది.

యజ్ఞం (అగ్నిహోత్రం) నిర్వహించబడే ప్రదేశంలో ఆవరిచుకొని ఉన్న వాతావరణంలోనూ, యజ్ఞకుండంలో మిగిలిన భస్మంలోనూ కొన్ని రకాల నరముల సంబంధిత రుగ్మతలను, ఆస్తమా, హృదయ సంబంధిత వ్యాధులు, శ్వాసకోశ వ్యాధులు, చాలారకాల చర్మవ్యాధులు, కళ్ళకు చెవులకు





సంబంధించిన అనేక రుగ్మతలను నివారించగలిగిన గుణాలున్నట్లు కనుగొనడం జరిగింది. భస్మం పై జరిగిన విశ్లేషణలో అందులో మనిషి మెదడును శాంతపరచి, స్థిరపరచి, నిదానపరిచే పదార్థాలున్నట్లు కనుగొనడం జరిగింది.

**4.2 కొన్ని కేసుల వివరాలు :** ఈ క్రింద కొన్ని నమూనా కేసులను వాటి ఫలితాలను ఇవ్వడం జరిగింది.

**(1) మాదకద్రవ్యాలు, సారాయికిబానిసత్వం :** భారత పదాతిదళంలోని మనోవైజ్ఞానిక విభాగానికి ముఖ్య సలహాదారు అయిన లెఫ్టినెంట్ కల్నల్ జి.ఆర్.గోలేచా, కొంత కాలంగా మాదక ద్రవ్యాలకు బానిసగామారిన, 25సం॥ల ఒక యువ అధికారిని ఒక పరిశీలన నిమిత్తం ఎన్నుకున్నారు. ఆ అస్వస్థుడు గత రెండు సంవత్సరాలుగా హీరాయిన్ అనే మాదకద్రవ్యానికి అలవాటుపడి ఉన్నాడు. గతంలో రెండుమార్లు ఆ అలవాటు నుండి తప్పించే 'డీ ఎడిక్షన్' కోర్సుకు హాజరయి కూడా ప్రయోజనం లేకపోయింది. ఇక అటువంటి ప్రయత్నాలపట్ల తీవ్ర విముఖత అతనిలో బయలుదేరింది. అటువంటి పరిస్థితులలో అతనికి ఈ అగ్నిహోత్ర చికిత్స ఇవ్వబడింది.

ఇందునిమిత్తం అభివృద్ధిని బేరీజువేసేందుకు విలువల కొలమానం ఒకదానిని డా॥ గోలేచా రూపకల్పన చేశారు. కొద్దివారాలలోనే యజ్ఞపు నియమిత ఆచరణచేత అతనిలో సంకల్పబలం అధికం కావడం, మాదక ద్రవ్యానికి దూరంగా మెలగడం, అది తీసుకోవాలనే తపన నెమ్మదిగా తగ్గుముఖం పట్టడం జరిగాయి.

దీని ద్వారా మనకు, అగ్నిహోత్రం లేదా యజ్ఞం వలన మనలో అంటిపెట్టుకుని మరలమరల వచ్చే వ్యతిరేక భావనలు తొలగి ప్రేమ, దయల రూపమయిన అనుకూల భావనలు పెరిగి, మాదక ద్రవ్యాలకోసం మనసుచేసే ఆరాటాన్ని తొలగించడంలో సహకరిస్తుందని తెలుస్తున్నది.

నైతిక బలం కోల్పోయిన ఒక మాదకద్రవ్య బానిసను తిరిగి మామూలుగా, ఆ అలవాటును మానుకునేలా చేయడంలో మనకు తెలిసిన అన్ని మానసిక వ్యాధి చికిత్సా విధానాలు విఫలమవగా, అగ్నిహోత్రం లేదా యజ్ఞం ఈ రంగంలో ఒక నూతన ఆశాకిరణంగా ఆవిర్భవిస్తున్నది.

(2) చక్కెర (డయాబెటిస్) వ్యాధి - అగ్నిహోత్ర చికిత్స

ఇది ఒక పేషెంట్ యొక్క చికిత్సా ఫలితము

పేరు : పాండురంగ ఎం.పాటిల్ వయస్సు : 72సం॥

విలాసం : సాయిప్రభ, మాంగ్వీర్ పఖాడి అలీబాగ్ తాలుకా / పోస్టు, రాయిగడ్ జిల్లా (మ॥రా)

చరిత్ర : ఒక సంవత్సరకాలంగా చక్కెరరోగ పీడితుడు.

యజ్ఞచికిత్స తీసుకోకముందు; ది.06-05-1993న తీయబడిన వివరాలు

1. ఉపవాస సమయంలో

రక్తంలో చక్కెర - 285/ Mg/dt. (సాదారణ 70 - 110)

మూత్రంలో చక్కెర - ఉన్నది ++++

2. భోజనానంతరం (2 గంటల తరువాత)

రక్తంలో చక్కెర 530 Mg/dt. (సాధారణ 120) వరకు)

మూత్రంలో చక్కెర : ఉన్నది ++++

అగ్నిహోత్రం నిర్వహించిన అనంతరం - ది. 24-07-93న తీయబడిన వివరాలు

1. ఉపవాస సమయంలో

రక్తంలో చక్కెర : 95 Mg/dt. (సాధారణ 70-110)

మూత్రంలో చక్కెర : లేదు





2. భోజనానంతరం

రక్తంలో చక్కెర : 120 Mg/dt. (సాధారణ 120)

మూత్రంలో చక్కెర : లేదు.

పైన ఉదహరించబడిన కేసు యొక్క రిపోర్టు రాయాఘడ్ ప్రాంతంలోని ఒక ప్రముఖ వైద్యసేవా కేంద్రానికి చెందిన డా॥ శ్రీమతి మోర్‌ఖాద్‌కర్ (ఎం.డి.)కి అందించబడింది.

పైపరిశోధనవలన ఒక డయాబెటిక్ రోగి నిష్ఠగా అనుదిన అగ్ని హోత్రాన్ని 3 నుండి 6 నెలలు నిర్వహిస్తే అతని రోగం దూరమయి సాదారణ ఆరోగ్యాన్ని పొందగలుగుతాడని మనం నిర్ధారించుకొనవచ్చును.

**(3) భోపాల్ గ్యాస్ విషాదము - అగ్ని హోత్రము :** డిశంబర్ 3,1984, ఒక మృత్యుభరితమైన రాత్రి సమయం, భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ కర్మాగారం నుండి విషభరితమైనట్టి వాయువు ప్రమాదవశాత్తూ వెలువడి, వ్యాపించి వందలకొద్దీ నిండు ప్రాణాలను బలికొని, కొన్నివేల మందిని ఆసుపత్రుల పాలుచేసింది. అయితే ఇందులో శ్రీ సోహన్‌లాల్ యస్.ఖుష్‌వహా మరియు శ్రీ ఎం.ఎల్.రాథోడ్ గారి కుటుంబాలను (ఈ ఫ్యాక్టరీకి ఒక మైలు పరిధిలో ఉన్నవి) మాత్రం ఈ మృత్యువాయువు ఏమీ చెయ్యలేకపోయింది. వీరుఅనుదినం ఇంటిలో హవనం చేస్తుంటారు. వీరి ఇల్లు ఈ వాయుదుర్ఘటన వలన అతిగా బాధించబడిన ఏరియాలో ఉండి కూడా ఆ ప్రాణాంతకవాయు దుష్ఫలితాలు ఎంతమాత్రం వీరిని అంటలేదు. వీరికుటుంబాలలో ఎవరూ మృత్యువాత పడలేదు. ఎవరూ ఈ వాయుదుర్ఘటన మూలంగా ఆసుపత్రిపాలు కాలేదు. అంటే వాతావరణ కాలుష్యాన్ని నిరోధించడంలో అగ్నిహోత్రం సరయిన మందు అని నిరూపణ అయింది. (ఈ విషయం గురించిన వార్త 4-4-1985 నాటి 'హిందూ'

పేపరులో Vedik Way to Beat Pollution' (వాతారణ కాలుష్యాన్ని నివారించడానికి వేదమార్గం) అనే మకుటంతో ప్రచురించబడింది.

**4.3'బ్రహ్మవర్చస్' వద్దగల యజ్ఞోపతి పరిశోధనశాల :** బ్రహ్మవర్చస్ అనే ఆధునిక పరిశోధనా కేంద్రం 1979లో పండిత శ్రీరామశర్మ ఆచార్యగారిచే స్థాపించబడింది. ఇది భారతదేశంలోని హరిద్వార్ స్టేషనునుండి 6 కిలోమీటర్ల దూరంలో, రిషీకేష్‌కు వెళ్ళుమార్గంలో సప్తసరోవర రహదారిలో నిర్మించబడిఉన్నది. ఈ కేంద్రం ప్రాచీన, ఆధునిక శాస్త్రాల ఏకతపై చాలా ఉత్సాహంతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. ఆధ్యాత్మిక అనే శాస్త్ర విషయంపై ఎంతో ఆధునిక సాంకేతిక పరిశోధనా కార్యక్రమం ఇక్కడ నిర్వహించబడుతున్నాయి. ఇక్కడ ఎంతో అంకితభావంతో పనిచేసే శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు, ఇతర అత్యున్నత స్థాయి ఆలోచన కలిగిన మేధా సంపన్నుల బృందాలకు తోడుగా, నాడీ మండల శాస్త్రము జీవరసాయన శాస్త్రము, హెమటాలజీ, ఫొటోకెమిస్ట్రీ, శబ్ద చికిత్సా విధానము మొదలైనవి ఉన్నాయి. ఇంతేకాక అత్యాధునిక విభాగాలలో పరిశోధనలు జరిగేందుకు అన్ని వసతులు కలిగిన యాంత్రిక సామాగ్రి అమర్చిన పరిశోధనాశాలలు ఉన్నాయి. మరో ముఖ్య ఆకర్షణ ఏమంటే ఇక్కడ 450 రకాల ఓషధులు, మూలికలు, అతి అరుదైన హిమాలయ చరియలలో దొరికే ఓషధులతో కూడిన మంచి బొటానికల్ గార్డెన్ ఉంది. దీనితోబాటుగా యజ్ఞోపతిపై పరిశోధన జరిపేందుకు ఒక పరిశోధనశాల కూడా ఉంది.

యజ్ఞోపతి ప్రయోగశాలలో ఒక గాజు గదిలో హవనకుండం ఉంచబడింది. దానికి అనుసంధించి ఒక వాయువిశ్లేషణ విభాగము ఉంది. యజ్ఞంలో ఉత్పన్నమయిన వాయువులను సేకరించి విశ్లేషించేందుకు ఇది నిర్దేశింపబడినది. యజ్ఞంలో హవిస్సులుగా వాడబడే పలురకాల మూలికల సమర్థత, సమిథల నాణ్యతలను బేరీజు వేసేందుకు 'గాస్ లిక్విడ్





క్రొమాటోగ్రాఫ్' అనబడే ఆధునిక విశ్లేషణా యంత్ర పరికరాలను అమర్చిన ఫొటో కెమిస్ట్రీ లేబొరేటరీ కూడా నిర్మించడింది. యజ్ఞంలో ఆహుతి కాకముందు అందులో ఉన్న ముడిపదార్థపు పరిమాణం, యజ్ఞానంతరం మిగిలివున్న పదార్థాల పరిమాణాలను బేరీజు వేసేందుకు ఇది ఉద్దేశింపబడింది.

కొంతమంది అనారోగ్యబాధితులను, సంపూర్ణ ఆరోగ్యవంతులను ఈ ఆవరణలో కొంతకాలం నివసించేటట్లుచేసి వారిపైన పరిశోధనలను చేయడం జరిగింది. ఇలా పరిశోధనలు జరుపబడిన వారిలో కొందరు సాధకులు మరికొందరు సాధనచేయనివారు, రకరకాల వయస్సులలో ఉన్నవారు. స్త్రీలు, పురుషులు, అన్నిరంగాలలో ఉన్నవారు ఉన్నారు. వారి సాంఘిక జీవన పరిస్థితులను కానీ, మత ధర్మాన్ని కానీ ఎంత మాత్రం పరిగణించక వారిపై పరిశోధనలు జరుపబడ్డాయి. ఇటువంటి పరిశోధనా సమయంలో వారిని యజ్ఞం జరుపబడుతున్న గాజుగదిలో ఉంచి, వారిచే యజ్ఞకుండీ నుండి వెలువడిన ఆవిరులు, వాయువులను ఒక నియమిత సమయంపాటు పీల్చేటట్లుగా చేశారు. ఈ పరిశోధన జరపడానికి ముందు, తరువాత వారి శరీరాలపై, మనస్సులపై సంపూర్ణ విశ్లేషణ జరిపి వివరాలను పొందుపరిచారు. క్రొమాటోగ్రాఫ్, మల్టీఛానల్ ఫిజియోగ్రాఫ్ వంటి పరికరాలతో నిర్వహించబడిన పరీక్షలవలన క్రింది కొలతలు, పరిమాణాలు తెలియ బడ్డాయి.

(HB - హెమోగ్లోబిన్, TRBC - ఎర్రకణాలు, TWBC - తెల్లకణాలు) మొత్తం HB, TRBC, TWBC వంటి హెమటోలాజికల్ పారామీటర్లు, రక్త సంబంధితమయిన, ఉండవలసిన స్థాయిలోని సంఖ్యావివరాలు, రక్తంలోని ప్లేట్‌లెట్‌లు, ఎర్రరక్తకణాల స్థితి వగైరాలు; జీవరసాయన మార్పులయిన రక్తంలోని యూరియా, చక్కెర, కొలెస్టరాల్, క్రియాటినైన్

SGOT - సీరమ్ గ్లూటామేట్ ఆగ్జలో ఎసిటేట్ ట్రాన్సమినేజ్ SGPT - సీరమ్ గ్లుటామేట్ పైరవేట్ ట్రాన్సమినేజ్ మొదలగునవి. రోగనిరోధక శక్తికి సంబంధించిన యాంటీబాడీల స్థాయి, రోగకారకమయిన హానికలుగజేసే జీవులనుండి రక్షణ కలుగజేసే ఆంతరిక నిరోధక శక్తి మొదలగువాటిలో మార్పులు వగైరాలు సవివరంగా సేకరించారు.

గ్రంధులకు సంబంధించిన ఎండోక్రైనాలజీ పరిశోధనశాలలో వివిధ రకాల హార్మోన్లయిన కార్టిసాల్, థైరాక్సిన్, ఎడ్రినో కార్టికో ట్రోపిక్ హార్మోన్ (ACTH) యాండ్రోజన్ వంటివాటి స్థాయీ భేదాలను పొందుపరిచారు. సైకోమెట్రీ పరిశోధనశాలలో జ్ఞాపకశక్తి, నేర్చుకునే శక్తి, తెలివితేటలు (I.Q.) భావోద్రేక స్థాయి, సంపూర్ణ వ్యక్తిత్వ రూపాన్ని విశ్లేషించే వివరాలను సేకరించారు. ఇలా సేకరించిన వివరాలను ఒక నియమిత కాలవ్యవధిలో అంటే యజ్ఞం నిరాటంకంగా ఒకవారం, ఒకమాసం చొప్పున కొనసాగిస్తుండగా, తిరిగి పరిశీలిస్తూ, మార్పులను పొందుపరచడం జరిగింది.

ఇలా జరుపబడిన శాస్త్రపరిశోధనలు, వాటి ఫలితాలను వీలువెంబడి ఆయారంగాలకు సంబంధించిన శాస్త్రీయ జర్నల్స్‌లో ప్రచురిస్తూ, యజ్ఞం ద్వారా పలువిధాల మూలికలను ఔషధాలుగా ఎలా ఉపయోగించ వచ్చునో అనే విషయంపై నిర్దేశక సూత్రాలను ఇస్తూ, మూలికా ఔషధాలపై మరింత విపులమయిన పరిశోధన జరిపి, యజ్ఞం అనేది కేవలం పైన కనుగొనబడిన ఉపయోగాలకే పరిమితం కాదనీ, మరెన్నో శాస్త్ర, సాంకేతిక విషయాలు ఇమిడిఉన్నవని, వాటిని ఆవిష్కరించేందుకు, వాటిపై మరింత పరిశోధనలను జరిపేందుకు రంగం సిద్ధం చేయబడుతున్నది.

యజ్ఞం నిర్వహించినందువలన పొందిన లాభాలను ఇంతవరకూ లభించిన వివరాలను క్రోడీకరించి విశ్లేషిస్తే, ఆ వ్యక్తులలో జీవశక్తి పెంపొంది,





శరీరంలో జరిగే అవాంఛిత జీవరసాయనచర్యలు జరుగకుండానూ, బాక్టీరియా వైరస్‌ల వంటి సూక్ష్మక్రిముల దాడికి శరీరం గురికాకుండా రోగనిరోధక శక్తి పెరిగి, రక్షణవలయం ఏర్పడిందని తెలిసింది. మానసిక శాంతి, భావోద్రేకపు స్థిరత్వము, సృజనాత్మకశక్తి పెంపుదల అనేవి మనకు మానసిక, భౌతిక దృక్కోణంలో కనిపిస్తున్న గణనీయమయిన మార్పులు.

ఈ విధమయిన పరిశోధనలు, ఈ పరిశోధనశాల చుట్టుప్రక్కల నివసిస్తున్న పశు, పక్షి, వృక్షజాలంపై కూడా జరిపి, యజ్ఞంద్వారా విడుదల చేయబడుతున్న శక్తి, ఆ జంతు, పక్షి వృక్షజాలంపై ఏ విధమైన ప్రభావం చూపుతున్నదో కనుగొని, ఆవిధంగా మొత్తం ప్రకృతిపై యజ్ఞ ప్రభావాన్ని కనుగొనే ప్రయత్నం కూడా జరుగుతున్నది.

**(5) అనుదిన సాధన నిమిత్తం ఒక సులువయిన అగ్నిహోత్రం :** జీవితంలో యాంత్రిక వినియోగం, పర్యావరణ కాలుష్యం కలగలుపుగా మానవ శరీరంపై, మనసుపై చెడు ప్రభావాన్ని చూపిస్తున్నాయి. విస్తృతమయిన అస్వస్థతలు, నైతిక విలువలు పతనంచెందడం వలన మనుషులలో ఒత్తిడి, శ్రమ, పగ, అసూయ, కామం, శతృత్వం, హింస పెరిగిన ఉదాహరణలను జీవనస్థాయి దిగజారిపోవడానికి తార్కాణాలుగా మనం గ్రహించవచ్చును. ఇంకో విషయమేమంటే కొద్ది సంవత్సరాలక్రిందట కొన్ని సమస్యలకు చికిత్సగా భావించబడిన విషయాలు మనం ఎంతమాత్రం ఎదురుచూడని రూపంలో ఇప్పుడు దుష్ప్రభావాలు, సైడ్ఎఫెక్ట్స్ చూపడం మొదలు పెట్టాయి.

ఈ పర్యావరణ విషపదార్థాలు, అవినీతిని పెంపుదల చేసే మూలకారణాలను ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో అంతేవేగంగా మనం అదుపు చేస్తేగాని, మనం బ్రతకలేని పరిస్థితి ఏర్పడింది. పర్యావరణ సమతుల్యతను స్థిరీకరించడం, వాతావరణాన్ని పరిశుద్ధం చేయడం, ఆరోగ్యవంతమయిన శరీరము, మనస్సు పెంపొందించడం అనేవి ఈనాడు

మనందరిముందు త్వరితంగా నిర్ణయం తీసుకుని చర్య తీసుకోవలసిన ముఖ్య కార్యక్రమాలుగా నిలుస్తున్నాయి. బలివైశ్యమనే ఒక సామాన్య అగ్నిహోత్రం నిర్వహించడం ఈ మార్గంలో అన్నింటిలోకి అతి చవుకయిన, సులువయిన విధానంగా, జీవితంలో అనుదినం ఆచరించదగినదిగా భావించవచ్చును.

అనుదినము అగ్నిహోత్రం నిర్వహించడం, ఈ క్రింద వివరించిన తీరులో చాలా సులభం, ఖర్చులేనిది, కేవలం కొద్ది నిముషాల సమయం మాత్రం చాలును, అయినా అది అన్ని విధాల చాలా ప్రభావవంతమయినది, లాభదాయకమైనదీను, ఈ యజ్ఞాన్ని నిర్వహించడంలో జాతి, మత, కుల, దేశ, లింగ, వయో భేదాలు అడ్డురావు. ఎవరైతే ఆరోగ్యంగా, ఆనందంగా జీవితంలో వత్తిడులులేక హాయిగా ఉండాలనుకుంటారో వారు ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా ఇది మొదలుపెట్టవచ్చు.

ఈ 'బలివైశ్య' మనే యజ్ఞంలో ఉదయం, సాయంత్రం భోజన సమయంలో, భోజనానికుపక్రమించే ముందు, తాజాశాకాహారాన్ని 5 చిన్న ముద్దలు అర్పణచేయాలి. ఆవుపేడతో చేసిన ఒక పిడక తీసుకుని దానిని ఒక రాగిపాత్రలో వేసి, పిడకను ఆవునేతితో వెలిగించి, గాయత్రీ మంత్రంతో ఆహారపు ముద్దలను ఆహుతులుగా సమర్పించాలి. బ్రహ్మవర్చస్ శోధనాలయం జరిపిన పరిశీలనలలో, ఇలా అనుదినము ఇంట్లో బలివైశ్య యజ్ఞాన్ని ఆచరిస్తున్న కుటుంబసభ్యుల శారీరక, మానసిక ఆరోగ్యాలు ఎంతో మంచి స్థాయిలో అభివృద్ధి చెందుతున్నట్లు విశదమయింది. అటువంటి గృహాలలోనూ, ఆ చుట్టుప్రక్కలా కూడా ఎంతో సహకార పూరితమయిన, సంతోషభరితమయిన వాతావరణం నెలకొని ఉంది.

మహారాష్ట్రలోని, షోలాపూర్ జిల్లాయందలి అక్కల్‌కోట్ అనే ఊరిలో ఉన్న "వైదిక శాస్త్రాల అధ్యయన సంస్థ" (ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టడీస్ ఆఫ్



యజ్ఞము ఒక సమగ్ర శాస్త్రము

వేదిక సైన్సెస్) మరొక రకమయిన అగ్నిహోత్రాన్ని అధ్యయనం చేసింది. మనిషి శరీరంలో నిర్మితమైఉన్న జీవగడియారంతోనూ (బయలాజికల్ క్లాక్) ప్రాణశక్తి వలయాలతోనూ అనుసంధానించబడిన యజ్ఞ విధానం అది. ఈ విధమైన యజ్ఞం నిర్వహిస్తున్న పలుప్రదేశాలలోని ప్రజల అనుభవాలను, కొన్ని పరిశోధనలను, వాటి ఫలితాలను సేకరించి క్రోడీకరించే ఒక అనుసంధానకారిగా ఈ సంస్థ వ్యవహరిస్తున్నది. ఈ అగ్నిహోత్రం యొక్క ముఖ్యలక్షణాలు ఈ క్రింద వివరించబడ్డాయి.

**(అ) జీవగడియారాలు - యజ్ఞ సమయాలు :** ఈ భూప్రపంచంమీద, సూర్యోదయం సూర్యాస్తమయం అనేవి అనుదినము జరిగే అతి ముఖ్యమయిన, ప్రభావం గలిగిన సంధి సమయాలు, అవి ప్రాణంతో ఉన్న జీవజాలంపైన చాలా బలమయిన ప్రభావాన్ని కలుగజేస్తాయి. ఈ సమయాలలో పర్యావరణంలో చాలా విస్తృతమైన స్థాయి మార్పులు ఏర్పడి, వాటి బలమయిన ప్రభావాన్ని జీవజాలంపైన, ప్రకృతి, పరిసరాలపైన కలుగజేస్తాయి. ఈ విధమైన ఉద్దీపన కలుగజేయబడిన సమయాలకు అనుకూలంగా ఆ సమయాలలో యజ్ఞకార్యక్రమాన్ని నిర్వహించడం వలన జీవాధారమైన ప్రాణశక్తితరంగాలను, మన సౌరమండలం నుండి భూమి మీదకు ఆకర్షించడం జరుగుతుంది.

శరీరంలో అనుక్షణం జరిగే క్రియలలోని హెచ్చుతగ్గులు, శరీర ఉష్ణోగ్రతతోను, గుండెలయతోనూ, రక్తపోటుతోనూ, ఈ సంధి సమయాలు అనుసంధిచబడివున్నాయి. ఈ సంధి సమయాలలో ఉచ్ఛ్వాస నిశ్వాసాల పద్ధతి తీవ్రమయిన మార్పులకు గురికాబడుతుందనే విషయాన్ని, మనోయోగం నాడీ శాస్త్రాలు ఎంతో ప్రాముఖ్యతనిస్తూ వెల్లడిచేశాయి. ఈ విధమయిన భౌతిక,శారీరక మార్పులు, తిరిగి సరిచేయబడు విధానాలు, మనిషి యొక్క మానసిక స్థితిపైన ఎంతో ప్రభావాన్ని చూపుతాయి కాబట్టి,

ఆ సమయంలో చేయబడే యజ్ఞం, ఈ ప్రకృతిలోని లయకు అనుగుణంగా మానవ శరీరం, మనస్సులు సహజస్థితిని సంతరించుకుని, ఒకదానితో ఒకటి సహకరిస్తూ, జతగా సమర్ధవంతంగా పనిచేసేటట్లు చేస్తుంది.

సూర్యోదయ సమయంలో నిర్వహించబడిన యజ్ఞ ఫలితంగా కలిగిన లాభాలు, వాతావరణంలో సూర్యాస్తమయం వరకూ చురుకుగా నిలచి ఉంటాయి. సూర్యాస్తమయ సమయంలో చేయబడిన యజ్ఞంవలన వాతావరణానికి ఉదయం నుండి తిరిగి సూర్యోదయం వరకూ అవసరమయిన అనుకూల స్థితిని అందిస్తుంది. ఈ విధంగా ఒక అనంతమైన, పూర్తి ఉత్తేజంతో కూడిన చికిత్సాలయం, అనుదినం యజ్ఞం జరుగుతున్న ఇళ్ళలో ఏర్పడుతుంది.

**(అ) ఆవు పేడతో చేసిన పిడకలు :** దాని నుండి మనం పొందుతున్న మిగతా ఉత్పత్తులు ఎంతో ఓషధీయ తత్వమున్నవన్న విషయం కొన్నివేల సంవత్సరాలుగా మనకు తెలిసి, అనుదిన అవసరాలలో ఉపయోగిస్తూ ఉన్నాము. ఆవుపేడలో మెథాల్, అమోనియా, ఫినాల్, ఇన్‌డాల్, ఫార్మలీన్ వంటి పదార్థాలు పుష్కలంగా ఉండి, రోగకారక సూక్ష్మజీవులను నిర్మూలిస్తాయి.

అప్పుడే వేసిన ఆవుపేడలో ఓషధీగుణాలతోబాటు, రోగనివారక గుణాలు కూడా ఉంటాయి. ఆవుపేడతో చేసిన పిడకలోనూ, అది మండించగా వచ్చిన ధూమంలోనూ ఎంతో చురుకయిన ఓషధీయుక్త గుణాలు ఉన్నవనేది ఋజువయిన సత్యం. కొందరు రష్యా శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలలో ఆవుపేడకు అణుధార్మికతను నిరోధించేశక్తి ఉన్నట్లు తెలిసింది.

**(ఇ) ఆహుతులు :** ఆవునేయి కలిపిన పచ్చిబియ్యం కొద్ది పరిమాణంలో రెండు మార్లు అగ్నిలో ఆహుతులుగా అర్పించడం జరుగుతుంది. ఆయుర్వేద చికిత్స ప్రకారం, ఆవునెయ్యి బలమును కల్గించేది,





హృదయానికి ఉత్తేజాన్నిచ్చేదిగా పరిగణిస్తారు. యజ్ఞంలో కరిగి వాయువై వ్యాపించిన ఆవునేయి ఎంతో ఉత్సాహాన్ని, మంచి ఆకలిని కల్గించే శక్తి కల్గిఉండి ప్రకృతి యొక్క చర్యలను సంతులనం చేసేవిగా ఉంటాయి. స్వచ్ఛమైన ఆవునేయి రోగకారక క్రిములను నిర్మూలించి, వాతావరణాన్ని పరిశుద్ధం చేయగలిగే శక్తిని కల్గిఉండి మానవాళికి, జంతు, వృక్షజాలానికి ఎంతో సహకరిస్తుంది.

**(ఏ) సూర్యోదయ సమయంలో చేయబడే యజ్ఞం :**

**1. అగ్ని ప్రదీపన ఏర్పాటు :** సూర్యోదయానికి 5 నుండి 10 నిమిషాలకు ముందు అగ్నిహోత్రం లేదా యజ్ఞం జరిపే పాత్రలో బాగా ఆరిన, ఆవుపేడతో చేసిన పిడక ముక్కలను అమర్చండి. పాత్ర అడుగుభాగంలో ఒక పిడక ముక్కను అమర్చి, గుగ్గిలము లేదా కర్పూరము లేదా ప్రత్తి దూదితో చేయబడిన వత్తిని ఆవునేతిలో బాగా తడిపి, అడుగున ఉంచిన పిడకమీద ఉంచండి. ఆ తరువాత దానిచుట్టూ పిడకముక్కలు అమర్చుతూ ఆహుతులు సమర్పించేందుకు మధ్యలో ఖాళీ జాగా ఉండేలా చూడండి. అగ్గిపుల్లగీసి ఆవత్తిని గానీ, కర్పూరాన్నిగానీ వెలిగించండి. అవసరమయితే ఒక విసనకర్ర నుపయోగించి అగ్గి అంతటా వ్యాపించేలా విసరవచ్చు.

**2. వస్తు సామాగ్రి :** రెండు చిటికెళ్ళ నూకలు లేని పచ్చి బియ్యం గింజలను ఎడమ అరచేతిలో గానీ, చిన్న పాత్రలో గాని వేసి, రెండు మూడు ఆవునేతి చుక్కలను వేసి బాగా కలగలిపి, రెండు భాగాలుగా విడదీసిఉంచండి.

**3. ఆహుతులు :** సరిగ్గా సూర్యుడు ఉదయిస్తున్న సమయంలో మొట్టమొదటి మంత్రమయిన 'సూర్యాయ స్వాహా' అని ఉచ్చరించండి. 'స్వాహా' అనడం ముగుస్తుండగా విభజించి ఉంచిన బియ్యంలో ఒక భాగాన్ని తీసి అగ్నికి అర్పిస్తూ 'ఇదం సూర్యాయ ఇదం నమమ' అని మంత్రంలోని మొదటి భాగాన్ని ముగించండి. తరువాత "ప్రజాపతయే స్వాహా" అని చెబుతూ,

'స్వాహా' అనడం ముగుస్తుండగా రెండవ భాగపు బియ్యాన్ని అగ్నికి సమర్పిస్తూ 'ఇదం ప్రజాపతయే ఇదం నమమ' అని మంత్రంలోని రెండవ భాగాన్ని పూర్తిచేయండి. ఇలా అర్పించిన ఆహుతి అగ్నిలో పూర్తిగా అదృశ్యమయి పోయేవరకు అగ్నిమీదనే దృష్టిని కేంద్రీకరించండి. ఉదయపు యజ్ఞం దీనితో పూర్తిఅవుతుంది.

**(బి) సూర్యాస్తమయ సమయపు యజ్ఞం:** సాయంత్రం సమయంలో ఉదయం యజ్ఞం చేసిన పాత్రనుండి భస్మంను తొలగించి ఒక చిన్న సంచిలో గానీ, పెట్టెలో గానీ వేయండి. ఉదయం చేసిన మాదిరి 1,2 అంశాల లోని మాదిరి ఏర్పాట్లు చేయండి.

ఆహుతులు సరిగ్గా సూర్యాస్తమయమవుతున్న సమయంలో "అగ్నయే స్వాహా" అని, స్వాహా అనడం ముగుస్తుండగా మొదటిభాగం ఆహుతిని సమర్పించి, వెంటనే 'ఇదం నమమ' అనండి. ఇదే విధంగా రెండవ ఆహుతిని 'ప్రజాపతయే స్వాహా' అంటూ సమర్పిస్తూ వెంటనే 'ఇదం ప్రజాపతయే ఇదం నమమ' అని మంత్రాన్ని పూర్తిచేయండి. ఆహుతి పూర్తిగా అగ్నిలో కరిగిపోయేంతవరకూ అగ్నిమీదనే దృష్టిని కేంద్రీకరించండి. దీనితో సాయంత్రపు యజ్ఞం ముగిసిపోతుంది.

**(6) యజ్ఞంలో ఇమిడివున్న సూక్ష్మ విషయాలు :**

ఇంతవరకూ మనం చర్చించుకున్నది కేవలం యజ్ఞం యొక్క భౌతిక వాద సంబంధిత విషయాలు. అంతకు మించిన స్థాయిలోని విషయాలు ఎంతో సూక్ష్మమయినవి, కారణభూతమయినవి. మానవుల మాదిరిగానే పదార్థానికి స్థూల - సూక్ష్మ - కారణ స్థాయిలున్నాయి. రక్తమాంసాలతో కూడుకుని కనిపించే శరీరము స్థూల శరీరం. ఈ భౌతిక శరీరాన్ని నియంత్రిస్తూ ఆలోచనలను కలిగించేది సూక్ష్మశరీరము. కారణ శరీరం (ఆస్ట్రల్ బాడీ) అంటే ఇందులో నమ్మకాలు కోరికలు, ఆశలు వగైరాలు





ఉంటాయి. భౌతిక శరీరమున స్థూల శరీరం కంటే సూక్ష్మశరీరం చాలారెట్లు శక్తివంతమయినది. అలాగే కారణ శరీరం సూక్ష్మ శరీరం కంటే మరెన్నోరెట్లు శక్తివంతమయినది.

యజ్ఞంలో ఉపయోగిస్తున్న అన్ని పదార్థాలలో ఉన్న సూక్ష్మశక్తి యజ్ఞ కర్మకాండలో నిర్ణయించబడిన విధివిధానముల వలన ఉత్ప్రేరణ చెందుతాయి. అప్పుడే అవి యజ్ఞం నిర్వహిస్తున్న వ్యక్తుల మనస్సు మరియు చైతన్యములను ప్రభావితం చేసి వాంఛనీయమైన మార్పును తీసుకువచ్చేందుకు వీలుపడుతుంది. ఈ ప్రక్రియగనుక జరగకపోతే, యజ్ఞం కేవలం, అందులోని వస్తువుల భౌతిక రసాయనిక పరివర్తనా ప్రక్రియగానే మిగిలి, కొన్ని వస్తువులు వాయువుగా మారడంగానే ఉండిపోతుంది. అయితే కేవలం ఇలా జరిగిన ప్రక్రియవలన కూడా కొన్ని లాభాలున్నాయి. యజ్ఞకుండం నుండి వెలువడిన సుగంధం చుట్టుప్రక్కల నుండి వస్తున్న దుర్వాసన, వాతావరణంలోని విషప్రభావాలను తొలగించి సుగంధాన్ని పరిసరాలకు వ్యాపింపజేస్తుంది, స్వేదాన్ని కలుగజేస్తుంది. వైరస్‌ల విషపూరిత అంటురోగాలను నిరోధిస్తుంది, శారీరకంగా ఈ రూపంలో లాభం కలుగుజేస్తుంది. అయితే ఇవి యజ్ఞం యొక్క అసలయిన శక్తిరూపం ముందు చాలా అల్పమయినవి అని మనం అర్థంచేసుకోవాలి.

యజ్ఞంలో పవిత్రమైన అగ్నికి మనం ఆహుతులుగా వేస్తున్న పదార్థాలలో యజ్ఞం యొక్క ప్రాముఖ్యత ఇమిడివుంది. హవన ద్రవ్యాలుగా ఎన్నకోబడిన సమిధలు పై విషయాన్ని పరిగణనలోకి తీసుకుని, వాటిలోని రసాయనాలు, తద్వారా జరిగే మంచి వాటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని ఎన్నుకోబడతాయి.

కారణజగత్తులో మార్పు తెచ్చేందుకు మంత్ర శాస్త్రం యొక్క సహాయాన్ని తీసుకోవాలి. యజ్ఞాన్ని నిర్వహించేవ్యక్తి ఇందులో పలికే

మంత్రాలను ఉచ్చరించడం, ఒకే స్వరంతో సక్రమంగా పలకడం, లయ, శృతి నిర్ణయించబడిన విధానంలో ఉండేటట్లుగా ముందుగా జాగ్రత్తలను తీసుకోవాలి, క్రమశిక్షణ పాటించాలి, ఇందులో సడలింపు ఏమీ ఉండకూడు. 'శబ్దం' (అనంతమైన విశ్వశబ్దం) అంటేనే బ్రహ్మ. సాధారణంగా దీనిని మన విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, ఆలోచనలను పంచుకునేందుకు ఉపయోగిస్తాము. అయితే, బాగా సూక్ష్మమయిన ఉన్నతమయిన స్థాయిలో ఈ శబ్దం శక్తిగా మార్పు చెందుతుంది.

**పదముల ఎంపిక, కలయిక, సరయిన విధానములో పలకడం అనేదే మంత్రము వలన జనించే లాభాన్ని నిర్ధారిస్తుంది.**

ఒక మంత్రంలో ఎన్నుకోబడిన పదాలు, వాటి కలయిక పలికే విధానాలు ఎంత పటిష్ఠంగా ఉండాలంటే, దానివలన మంత్రంలోని చైతన్యము జాగృతమయి, శక్తివంతమయి, అద్భుతమయిన లాభాలను అందజేసేదిగా ఉండాలి. దీనిపైనే మంత్రశాస్త్రం సంపూర్ణంగా ఆధారపడి ఉంది.

యజ్ఞంలో ఉపయోగించే పాత్రలు, చివరికి నీరు కూడా కొన్ని నిర్దిష్టమయిన మంత్రాలను ఉచ్చరించి, ఆపైననే ఉపయోగించాలి. సమిధలుగా వాడబడే దారువును ముందుగా బాగా కడిగి శుభ్రంగా ఆరబెట్టిన వాటిని ఎన్నుకొని, మంత్రాలతో శుద్ధిచేసిన తరువాతనే ఉపయోగించాలి. వేదిక పూజనం, యజ్ఞశాల పూజన విధానాలు హవన కుండానికి జీవం పోసేందుకు ఉద్దేశించబడ్డాయి. ఇది సామూహికంగా ఔషధాన్ని ఇవ్వడం వంటి ఒక శాస్త్రీయమయిన విధానం. దీనివలన యజ్ఞ విధానంలోని ఆధ్యాత్మిక పునాది బలపడి దృఢమవుతుంది.

ఆధ్యాత్మిక క్రమశిక్షణ సాధనచేసేందుకు కావలసిన ప్రోత్సాహము, అనుకూలత కలిగిన వాతావరణము యజ్ఞం జరిగే ప్రదేశంలో ఉంటుందనేది





అనుభవంతో తెలుసుకున్న సత్యం. జపాన్‌లోని టోకియోకు చెందిన డా॥ మోటోహామా, మానవ శరీరాన్ని ఆవరించివున్న విద్యుత్‌క్షేత్రాలను కొలిచే పరికరంతో, యజ్ఞం వలన కలిగే ప్రభావాలను పరీక్షించారు. యజ్ఞం జరిపిన తరువాత మనిషిలోని అనాహతచక్రం (హృదయ కుహరం) నుండి వెలువడిన తరంగాలు, మానసిక, ఆధ్యాత్మిక విధానాలలో చికిత్స జరిగిన అనంతరం వెలువడే తరంగాలను పోలిఉన్నాయని తెలియజేశారు.

**(6.1) మంత్రాలు - శబ్దము యొక్క సూక్ష్మ విస్తీర్ణాలు :**

యజ్ఞసమయంలో మంత్రాలు ఉచ్చరించడం ముందుగా ఒక నిర్దేశించబడిన పద్ధతి, సూత్రాలకు అనుగుణంగా ఉంటుంది. అందువలన ఇవి ఉచ్చరించే వ్యక్తులకు లాభాన్ని కలిగిస్తాయి, పరిసర వాతావరణాన్ని ఉత్తేజ పరచి ఉత్సాహాన్ని తరంగరూపంలో వ్యాపింపజేస్తాయి. అంతేకాక, యజ్ఞ కార్యక్రమంలో ఉపయోగింపబడే వస్తువుల, పదార్థాలలోని సూక్ష్మశక్తిని ఉత్తేజపరచి, వాటిలో అంతర్లీనంగా దాగిఉన్న శక్తి మొత్తంగా బయల్పరచేలా చేస్తాయి. మంత్రాల సహాయంతో వస్తువులను పవిత్రంగా పూజనీయంగా చేయవచ్చును. అలాగే ఒక ఆశీర్వాద రూపంలో ఇస్తే మంత్రం ముందుకంటే ప్రతిభావంతంగా రోగిపై పనిచేస్తుంది. హవిస్సులుగా (ఆహుతులుగా) యజ్ఞాగ్నికి సమర్పించబడే వస్తువులను ముందుగా మంత్రాల సహాయంతో, వాటి సూక్ష్మశక్తిని జాగృతపర్చడం వలన, ఎంతో విజయవంతమయిన ఫలితాలు కలిగి, చాలా సాధారణమయిన వస్తువు లేదా పదార్థం కూడా అసాధారణమయి ప్రత్యేక శక్తులు సంతరించుకున్నట్లు తెలుస్తున్నది. మంత్రాలు లేకుండా ఆ హవిస్సులను కేవలం యజ్ఞకుండంలోని అగ్నిలోకి జారివిడిస్తే జరిగేది, సుగంధభరితమైన పరిమళం వెలువడి పరిసరాలను నింపుతుంది. అంతకుమించి యజ్ఞంలో పొందవలసిన లాభాలు మనకు అందవు.

యజ్ఞ సమయంలో సామూహికంగా ఒక మంత్రాన్ని ఉచ్చరించితే, దాని శబ్ధశక్తి అపరిమితంగా పెరుగుతుంది. ఎందువల్ల నంటే, (1) మంత్రోచ్ఛారణతో ఉద్భవించిన శబ్దతరంగాలు యజ్ఞకుండంలో ప్రజ్వలిస్తున్న అగ్ని ఏర్పరచిన పలుచని తెరకు తగిలి, వెనుకకు, ముందుకు అతి వేగంగా కదిలే తరంగాలుగా మారి, ఉత్పన్నమయిన ప్రకంపనాలకు కారణమౌతాయి. (2) మంత్రాలలోని శబ్దాలతో తరంగాలు, విశ్వమందలి వ్యోమశక్తి కేంద్రం, అంటే ఆ శబ్దాలతో అనుసంధించిఉండి, వాటిని వ్యాపింపజేసే దైవీ శక్తులతో కలసి, జరిపే సూక్ష్మ, పరస్పర చర్యల ఫలితాన్నిస్తాయి. (3) యజ్ఞాగ్నిలో వేయబడిన పదార్ధాలు ధూమంగా మారే ప్రక్రియకు అనుసంధించ బడివున్న మూలాధార ఉష్ణయాంత్రిక ప్రభావాలు ఉత్పన్నమౌతాయి. (4) యజ్ఞాన్ని నిర్వహిస్తూ సామూహికంగా మంత్రాలను ఉచ్చరించే మనుషుల దైహిక, మానసిక, కారణశక్తుల యొక్క మిశ్రమ ప్రభావము వలన ఇవి జరుగుతూ ఉంటాయి.

యజ్ఞసమయంలో యజ్ఞాగ్నిలో సూక్ష్మీకరించబడి, ధూమంగా పదార్ధాలు మారుతున్నప్పుడు వెలువడే ఎలక్ట్రానుల తోపిడివలన, యజ్ఞ కార్యక్రమంలో ఉచ్చరించబడుతున్న మంత్రాలలోని శబ్దతరంగాలు, సాధారణంగా అవి వ్యాపించే వెడల్పాటి వలయాలుగా కాక, ఒక నిడు పైన వలయాకారపు స్ప్రింగు రూపంలో పైకి ఆకాశంలోకి పంపబడతాయి. అతివేగంగా కదిలే ఎలక్ట్రానులు, నియమిత సమయంలో సామూహికంగా పలికే మంత్రాల ద్వారా ఉత్పన్నమయిన శబ్దతరంగాలు ఒక దానితో ఒకటి ఢీకొన్నందు వలన అవి అయనోస్ఫియర్, మరిదానికన్నా పైకి, దూసుకుపోగలగుతాయి. ఈ విధంగా ఒక నియమిత లయతో యజ్ఞకుండమందలి అగ్నిముందు సామూహికంగా ఉచ్చరించబడే మంత్రాల వలన ఒక విలక్షణతత్వం కల్గిన, అంతరిక్షం దాటి విశ్వంలోకి వ్యాపించగలిగే, అనంతమైన వ్యాపకశక్తి కల్గిన శబ్దతరంగాలు ఉత్పన్నమవుతాయి.





మంత్రాన్ని ఉచ్చరించే వ్యక్తి, ఆ మంత్రాలపట్ల పరిపూర్ణ గౌరవం, విశ్వాసం కల్గివుండి, సక్రమమయిన, నియమితమయిన స్థాయిలో గొంతు మరియు నాలుకలను ఉపయోగిస్తూ, వారి ఆలోచనల, భావోద్రేకాల, వ్యక్తిత్వాల చర్యల ద్వారా, జీవితంలోని ప్రతి అంశంలోనూ పవిత్రత మరియు ఐక్యతలను ప్రతిబింబించే వారుగా ఉండాలి. ప్రాచీన భారతీయ వేదాలలో, పదశబ్దాల ఉచ్చారణ గురించిన సూక్ష్మ విజ్ఞాన శాస్త్రంలో 'వాణి' అంటే గొంతు యొక్క స్థాయి నాలుగు విధాల ఉండాలని తెలియజేయబడుతున్నది. అవి 'వైఖరి', 'మధ్యమ', 'పర' మరియు 'పశ్యంతి', ఈ విషయాల గురించిన సమగ్రమయిన పరిజ్ఞానం తెలిసేందుకు, అందుకు చేయవలసిన సాధన, 'గాయత్రి' మరియు 'యజ్ఞ' విధానాలవల్ల సాధ్యపడుతుందనేది ప్రముఖంగా ఎత్తిచూపబడింది.

'వాణి' యొక్క నాలుగు స్థాయిలలో మొదటిది ప్రాథమిక స్థాయి అయిన 'వైఖరి'ని సఫలసాధనచేసి శబ్దతరంగాలలోని అత్యధిక, అత్యల్ప స్థాయిలో అనుభవించే అద్భుతాలను మనం పొందవచ్చును. 'మధ్యమ' స్థాయి ఆలోచనా తరంగాల సామ్రాజ్యంలో పనిచేస్తూ బాగా శుద్ధి, సాధన చేయబడితే ఇంకా సూక్ష్మమయిన 'పర' మరియు 'పశ్యంతి' స్థాయిలోని శబ్దాలను పొందగలుగుతాము. 'పర' మరియు 'పశ్యంతి' శబ్ద స్థాయిలను ఆధ్యాత్మిక సందేశాలను పంపి అందుకొనుటకు 'బ్రహ్మ' తో సంభాషించేందుకు అవసరమయిన స్థాయిలుగా భావిస్తారు.

ఆధ్యాత్మికంగా పరిశుద్ధుడయిన, సమర్ధుడయిన సాధకుడు యజ్ఞం నిర్వహించేటపుడు అతడు లేదా ఆమె ఉచ్చరించే మంత్రాలు, అతనిలో, ఆమెలో జాగృతమయిన శక్తివలన, పైన చెప్పిన నాలుగు శబ్దస్థాయిల ముద్రను కలిగి ఉంటాయి. అటువంటి వ్యక్తి జరిపిన యజ్ఞం, ఆధ్యాత్మికతతో నింపబడిన వాతావరణాన్ని ఉత్పన్నం చేసి జీవులందరి

చైతన్యాన్ని పై స్థాయికి తీసుకువెళ్ళి, ఈ ప్రకృతిలోని భౌతిక, వస్తుపద్ధతులను సమ్మేళనం చేయగలిగినంతటి ప్రతిభావంతంగా ఉంటుంది.

ఈ యజ్ఞాల వలన కలిగే భౌతిక ప్రభావాలపై జరిగిన, వస్తు ప్రధాన విశ్లేషణ, అందులో ఇంకా జరుగుతూ కొనసాగుతున్న పరిశోధనలతో బాటుగా, అతి సున్నితమైన సూక్ష్మమైన శాస్త్రంగా 'యజ్ఞాన్ని' 'గాయత్రిని' భావించడం అనేవి మానవాళికి, ప్రపంచంలోని సమస్త జీవరాశికి ఉజ్జ్వల భవిష్యత్తును అందించడం అనేది 'తథ్యం' అని విశదీకరిస్తున్నాయి.

| **సేకరణ, కూర్పు** | **తెలుగు అనువాదం** |
|---|---|
| డా॥ రజని ఆర్. జోషి | దేవీప్రసాద్ |
| ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ | గుంటూరు. |
| ముంబాయి. | |